సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 23 - ఆదివారం 29 జనవరి, 2017 సంపుటి : 2 సంచిక 18 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

## "పద్మ"లు వరించేదెవరినో...



గన్ని భాస్కరరావు | డీవీ శ్రీరామమూర్తి | గరికపాటి నరసింహారావు



క్రోవి పార్థసారధి

**రాజధానివార్తలు డెస్క్ :** పద్మ అవార్డుల కోసం అన్ని రాష్ట్రాల నుంచి అనేక పేర్లు కమిటీకి పంపారు. ఒలంపిక్ విజేతలైన సింధు, సాక్షిమల్లిక్‌లతోపాటు అమెరికాలో పనిచేస్తున్న గూగుల్ చీఫ్ సుందర్ పిచాయ్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదేళ్ల, సౌత్‌కరొలినా గవర్నర్‌గా ఎన్నికైన భారత్- అమెరికా సంతతికి చెందిన నిక్కీహేలీతో సహా 150 పేర్లను పద్మ అవార్డుల కోసం పంపారు. ఎన్‌సీపీ అధినేత మాజీ కేంద్ర మంత్రి శరద్‌పవార్ (76) కూడా ఈ జాబితాలో ఉన్నారు. మాజీ కేంద్రమంత్రి, బీజేపీ మార్గదర్శక్ మండల్ జోషి (83)ల పేర్లను పారదర్శకత్వం కోసం వెబ్‌సైట్‌లో ఉంచారు. దేశంలో అత్యున్నత పురస్కారం భారతరత్న కాగా, పద్మవిభూషణ్, పద్మభూషణ్,పద్మశ్రీ అవార్డులు వరుస క్రమంలో ప్రాధాన్యత సంతరించుకుంటాయి. సంప్రదాయక నృత్యంలో లక్ష్మీ విశ్వనాథ్,బసంతి బిషత్, జానపద నృత్యంలో కుమౌని, కథాకళిలో సీకే నాయర్, ప్రముఖ శిల్పి మహ్మద్ యూసఫ్ ఖత్రిలు పద్మజాబితాలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వానికి మొత్తం 1,730 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి 150 మందిని ఎన్నిక చేశారు. కొన్ని పేర్లను నిఘాసంస్థల నివేదికల మేరకు తొలగించి, మిగతావాటిని పద్మ అవార్డుల కమిటీ ముందుంచారు. 1954 నుంచి భారత ప్రభుత్వం ఆయా రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డులను అందచేస్తోంది. ఇప్పటివరకు 4,329 మంది ఈ అవార్డులు అందుకున్నారు. వారిలో అత్యున్నత అధికారులు, కళలు, సైన్సు, క్రీడలు, రాజకీయ రంగాలకు చెందిన వారున్నారు. అత్యధికంగా పద్మ అవార్డులు అందుకున్న వారిలో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో నిలవగా, మహారాష్ట్ర 756 అవార్డులతో రెండో స్థానంలో నిలిచింది. ఈ రాష్ట్రం నుంచి అవార్డులు స్వీకరించిన వారిలో లతామంగ్కర్, సచిన్ టెండుల్కర్‌లతో సహా 8 మంది భారత రత్న అందుకున్నారు. 391 అవార్డులతో తమిళనాడు ఆతర్వాతి స్థానంలో నిలిచింది.

**పద్మఅవార్డుల రేసులో గోదావరి జిల్లాల ప్రముఖులు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పద్మ అవార్డుల కోసం జాబితాను కేంద్రానికి పంపింది. దీనిలో రాజమండ్రి జీఎస్ఎల్ వైద్యకళాశాలను ఏర్పాటు చేసిన డాక్టరు. గన్ని భాస్కరరావు, అవధానిగా తెలుగు భాషను ప్రపంచానికి చాటిచెప్పిన గరికపాటి నరసింహారావు , దాదాపు శతాబ్ద కాలంగా ఆయుర్వేద వైద్యాన్ని అందిస్తున్న చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ అధినేత డీవీ శ్రీరామమూర్తి, ప్రముఖ రచయిత,ఆత్యాధ్మిక వేత్త, ప్రొఫెసర్ క్రోవిపార్థసారధిలు ఉన్నారు. వీరిపేర్లు రాజ్‌నాథ్‌సింగ్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇతరులు చాలా మంది ఈ అవార్డులకోసం రాజకీయనాయకులతో పైరవీలు,ధనప్రభావం కూడా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## స్టేడియం నిర్మించండి మహా ప్రభో...

### సి.కె. నాయుడు నడయాడిన నేలకు దుస్థితి



**రాజధాని ప్రతినిధి, మచిలీపట్నం :** బందరు పురపాలక సంఘానికి 150 సంవత్సరాలు. దేశంలోనే రెండో పురపాలక సంఘంగా పేరొందిన బందరులో స్టేడియం లేక పోవడం క్రీడాకారులకు శాపమే. భారత క్రికెట్ జట్టుకు నాయకత్వం వహించిన కల్నల్ సికె. నాయుడు నడయాడిన ఈ నేల పై ఇప్పటికి క్రీడా ప్రాంగణం నిర్మించక పోవడం ఈ ప్రాంత ప్రజాప్రతినిధుల అసమర్ధతకు గీటురాయిగా చెప్పక తప్పదు. వాలీబాల్‌కు నోబుల్ కాలేజి, హాకీకి నేషనల్ కాలేజి, క్రికెట్‌కు హిందూ కాలేజిలు కేరాఫ్ అడ్రస్‌గా కలిగిన చరిత్ర బందరులో కాలేజీలకు ఉండేది. అంతటి ప్రాధాన్యత ఉన్న బందరు కనీసం ఇండోర్ స్టేడియంకు కూడా నోచుకోక పోవడం క్రీడాకారుల దౌర్భాగ్యంగా పేర్కొనాలి.

**80వ దశకంలో ఇండోర్ స్టేడియంకు శంకుస్థాపన**

80వ దశకంలో అంటే రాష్ట్రానికి టంగుటూరి అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆనాటి మున్సిపల్ చైర్మన్ పేర్ని కృష్ణ మూర్తి హయాంలో స్థానిక జిల్లా కోర్టు సెంటరులో ప్రస్తుతం అంబేద్కర్ భవనం వున్న స్థలంలో శంకుస్థాపన జరిగింది. ఆ శంకుస్థాపన శిలాఫలకం అందరిని కళ్ళూరిస్తూ కనిపించింది. 1994లో అంబేద్కర్ భవన నిర్మాణానికి అదే స్థలంలో శంకుస్థాపన చేయడం ఇండోర్ స్టేడియం నిర్మాణం కథ కంచికి చేరింది.

**స్టేడియం నిర్మాణానికి కలెక్టర్ బంగ్లా స్థలం పరిశీలన**

బందరు పట్టణంలో ఓపెన్ స్టేడియం నిర్మాణానికి ఓ దశలో కలెక్టర్ బంగ్లా స్థలాన్ని సైతం పరిశీలించారు. నడకుదిటి నరసింహారావు రాష్ట్ర మంత్రిగా వున్నప్పుడు బందరులో స్టేడియం నిర్మాణ ప్రతిపాదనను తెర మీదికి తీసుకు వచ్చారు. ఆ క్రమంలో ఎక్కడ నిర్మించాలనే ప్రశ్న ఉత్పన్నమైనప్పుడు చిలకలపూడి మార్గంలో వున్న కలెక్టర్ బంగ్లా స్థలంలో నిర్మించాలని తలంచారు. బంగ్లాను మరోచోట నిర్మించాలని కూడా అప్పట్లో భావించారు. ఆ ప్రయత్నం కూడా ఎందుకో అటకెక్కింది.

**సగంలో ఆగిన 'పేర్ని' ప్రయత్నం**

జిల్లా పరిషత్ కార్యాలయానికి సమీపంలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన స్థలంలో స్టేడియం నిర్మాణానికి చేసిన ప్రయత్నం కొంత మేరకు ఫలించిందనే చెప్పొచ్చు. స్థలానికి చుట్టు కాంపౌండ్ వాల్ నిర్మాణం, గ్యాలరీ ఏర్పాటు లాంటి పనులను ప్రారంభించినా సగంలోనే ఆగిపోవటం ఈ ప్రాంత క్రీడాకారులను తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది. స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన స్థలంలో ఈ నిర్మాణాలు చేపడుతున్నందున వారికి వేరే చోట స్థలం చూపించేందుకు ఆనాటి ఎమ్మెల్యే పేర్ని నాని ప్రయత్నించినా వారు నిరాకరించి కోర్టుకు వెళ్లడంతో నాని ప్రయత్నం బెడిసి కొట్టింది. దీంతో సగంలో ఆగిన క్రీడా ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు ఆడ్డాగా తయారయ్యింది. దీంతో చుట్టు ప్రక్కల వారికి నిద్దుర కరువైంది. సౌట్స్ అండ్ గైడ్స్ వారి అనుమతితో పనులు చేపడితే పరిస్థితి ఇలా వుండేది కాదని క్రీడా ప్రేమికులు చెబుతున్నారు.

**మంత్రి కొల్లు కష్టం ఫలించేనా...**



తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రి పదవిని అలంకరించిన కొల్లు రవీంద్ర తొలి రెండేళ్ళ పదవి కాలంలో పుష్కరాల పోర్టు భూముల వ్యవహారాల్లో తలమునకలయ్యారు. అయితే స్థానిక పంపుల చెరువు ప్రక్కన విజయవాడ రహదారికి సమీపంలో రూ. 100 కోట్లు విలువైన 22 ఎకరాల ఖాళీ స్థలంలో స్టేడియం నిర్మాణానికి రూ. 60 కోట్లు కేటాయించాల్సి ఉండగా మంత్రి రూ. 2 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈసారైన బందరు క్రీడాభిమానుల కోరిక నెరవేరాలని కోరుకుందాం.



మచిలీపట్నంలో రాజధాని వార్తలు 2017 కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి పత్రికలు వారధిలా ఉండి ప్రజా సంక్షేమం, అభివృద్ధిలో భాగస్వామ్యం అయి, నవ్యాంధ్ర నిర్మాణానికి తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు.




రాయపూడి ఫైనల్ లాండ్ పూలింగ్ లేఅవుట్

## అమర్‌రాజా ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం

**ప్రాణభయంతో పరుగులు..**




**చిత్తూరు:** ప్రమాదవశాత్తు భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో కార్మికులంతా ప్రాణభయంతో పరుగులు పెట్టారు. టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ కు చెందిన అమర్ రాజా బ్యాటరీస్ ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పూతలపట్టు మండలం, పేటమిట్ట గ్రామం వద్ద ఉన్న అమర్ రాజా బ్యాటరీ విడిభాగాల ఫ్యాక్టరీలో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదవశాత్తు భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో కార్మికులంతా ప్రాణభయంతో పరుగులు పెట్టారు. భారీగా ఎగసిపడ్డ మంటల ధాటికి ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. సమాచారం అందుకున్న పాకాల అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియరావాల్సి ఉంది.

## 10 నుంచి 12 వరకు మహిళా పార్లమెంటేరియన్ల సదస్సు

**సదస్సు ప్రపంచానికే దిక్సూచి కావాలి: సీఎం చంద్రబాబు**

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** అన్నిరంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని, ఫిబ్రవరిలో విజయవాడలో జరిగే జాతీయ మహిళా పార్లమెంటరీ సదస్సు నిర్ణయాలు ప్రపంచానికే ఓ దిక్సూచిలా ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. ఫిబ్రవరి 10,11,12 తేదీలలో ఇబ్రహీంపట్నం దగ్గర పవిత్రసంగమంలో జరగనున్న జాతీయ మహిళా పార్లమెంటరీ సదస్సు సన్నాహక కార్యక్రమాన్ని స్థానిక గేట్‌వే హోటల్‌లో ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మీడియాతో తమాట్లాడుతూ మహిళాలోకానికి ఇది వెలుగు కాన్ఫరెన్స్ కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఇంత పెద్ద కార్యక్రమం మహిళల కోసం జరుపుతున్నామని, దీనిని ఉపయోగించుకుని మహిళలు తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవాలని కోరారు.



సీఎం చంద్రబాబు నాయుడు



స్పీకర్ కోడెల శివప్రసాద్

జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వివిధ రంగాలలో ఉన్న ప్రముఖ మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి అనుభవాలను చెపుతారని తెలిపారు. భారతదేశంలో మహిళల ప్రాతినిధ్యం అన్నిరంగాల్లో గణనీయంగానే పెరుగుతుందని, ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన వాటా కల్పించగా తాను స్థానిక సంస్థల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్

- మిగతా 7 లో

## ఈవారం రాజధాని

- ఫిబ్రవరి 4 నుంచి జాతీయస్థాయి ఖేలో ఇండియా : స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు
- వచ్చే నెల 2న మోడల్ పోలీసు స్టేషన్ల ప్రారంభం : రాష్ట్ర ప్రభుత్వం
- 25న నాగార్జునవర్సిటీలో వీసీల సమావేశం : రెక్టార్ ఆచార్య ఏఆర్ఎస్ సాంబశివరావు
- రాజధాని రైతులకు వెంటనే పెన్షన్ ఇవ్వాలి : ఆర్కే
- జులై 1 నుంచి జీఎస్టీ : అరుణ్‌జైట్లీ
- రేషన్ షాపుల్లో ఇక నగదు రహితం : కృష్ణాజిల్లా కలెక్టర్ బాబు
- నోట్ల రద్దుపై సెమినార్ 22న... : రాష్ట్ర అధ్యక్షులు ఇందల్‌వాయి కిషన్

## రైతుల భూములు లాక్కోవద్దు

- బినామీలకు లబ్ధి చేకూరేలా ప్రణాళిక
- రాజధాని ప్రాంత పర్యటనలో జగన్ ఆరోపణలు

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ ద్వారా భూములు తీసుకుని వచ్చినవారికి, నచ్చిన ధరకు నచ్చిన ప్రాంతంలో కేటాయిస్తూ.. రైతులకు అరకొర పరిహారం ఇచ్చి కన్నీరు కార్చేలా చేస్తున్నారని వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాజధాని ప్రాంతంలో రైతులు, దళితుల నుంచి ప్రభుత్వం బలవంతంగా లాక్కున్న భూములను వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే వారికే తిరిగి ఇస్తామన్నారు. గుంటూరు జిల్లా రాజధాని ప్రాంతమైన తాడేపల్లి, తుళ్లూరు, మంగళగిరి మండలాల్లో ఆయన పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. మంగళగిరి మండలం నిడమర్రులో ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్న జగన్ అక్కడి రైతులతో సమస్యలను చెప్పించారు. రాజధాని ప్రాంత అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే రైతులను ఆనందపరిచేలా పరిహారం అందించాలనేది తమ డిమాండ్ అని ఆయన పేర్కొన్నారు. తాడేపల్లి ప్రాంతంలో ఎకరం భూమి రూ.15 కోట్లు పలుకుతుంటే సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం పేరుతో రూ.40 లక్షలు ఇచ్చి భూసేకరణ ద్వారా లాక్కోవడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. భూసేకరణకు నోటీసులు ఇచ్చిన పెనుమాక, ఉండవల్లి, నవలూరు, ఎర్రబాలెం గ్రామాలకు ప్రతిపక్ష నేత వెళ్లడానికి అనుమతినివ్వ కుండా అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రెండుసార్లు రిజిస్ట్రేషన్ ధరలు 200శాతం పెంచిన ప్రభుత్వం రాజధాని ప్రాంతంలో ఈ ధరలు పెంచకుండా మోసం చేసిందని ఆరోపించారు. భూసేకరణ చేయాల్సి వస్తే రైతులకు అధిక ధర చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో కుట్రపూరితంగా వ్యవహరించిందని ధ్వజమెత్తారు. రైతులకు కేటాయిస్తున్న ప్లాట్లలో మౌలిక వసతులు కల్పించకుండా, ప్లాట్లు ఎక్కడున్నాయో తెలియకుండానే చెత్త కాగితాలు పంచారని ఆరోపించారు. మూడేళ్లయినా రాజధాని బృహత్తర ప్రణాళిక రూపొందించలేకపోయారని, శాశ్వత కట్టడాలకు ఒక్క ఇటుకా వేయలేదని ధ్వజమెత్తారు.



మాట్లాడుతున్న జగన్ మోహన్‌రెడ్డి

**బినామీలకు భూముల ధారదత్తం**

రైతులు నుంచి లాక్కున్న భూముల్లో 1600 ఎకరాలు సింగపూర్ ప్రైవేటు కంపెనీకి ఇవ్వడమే కాకుండా రూ.5700 కోట్లు పెట్టుబడులు పెట్టి 42 శాతం వాటా పభుత్వం తీసుకుంటోందని జగన్ ఆరోపించారు. ఇష్టారాజ్యంగా కేటాయిస్తూ ముఖ్యమంత్రి కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. సింగపూర్ కంపెనీ రూ.306కోట్లు పెట్టుబడులు పెట్టి 58 శాతం వాటా తీసుకుంటున్నదని ఆరోపించారు. నూజివీడు, ఆంధ్రావర్సిటీ పరిసరాల్లో రాజధాని వస్తుందంటూ లీకులు ఇచ్చిన ముఖ్యమంత్రి బినామీలు తక్కువ ధరకే అక్కడ భూములు కొనుక్కునేందుకు సహకరించారన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాలను జోన్లుగా విభజించి బినామీల భూములను స్థిరాస్తి వ్యాపార జోన్‌లోనూ, రైతుల భూములను వ్యవసాయ జోన్‌లోనూ పెట్టి మరోసారి రైతులను మోసం చేశారని వివరించారు. తాత్కాలిక సచివాలయం నిర్మాణానికి ఆరు లక్షల చదరపు అడుగుల

- మిగతా 3 లో






# రాజధాని వార్తలు కలం

## ఖైదీ 150 హిట్‌తో చంద్రబాబు వ్యతిరేక వర్గం 'ఖుషీ'

మెగాస్టార్ చిరంజీవి ఖైదీ నెం.150 సూపర్ సక్సెస్‌తో మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్‌నే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యతిరేక వర్గాలను కూడా ఆనందంలో ముంచింది. కాపుల్లోని ఒక వర్గం తమకు బీసీ రిజర్వేషన్లు కల్పించకుండా ముద్రగడ పద్మనాభం ఆందోళనను పోలీసులతో అణగ దొక్కడంతో ఆయనపై గుర్రుగా ఉన్నారు. ఇదే సమయంలో ప్రశ్నిస్తాను.. నిలదీస్తాను లాంటి ప్రసంగాలతో జనాల్లోకి వచ్చిన పవన్‌పై ఎంతో ఆశొ ఎట్టుకున్నా ఆయన చంద్రబాబు చిటికెన వేలు పట్టుకొని నడవడంతో మరొక ప్రత్యామ్నాయం లేకపోయింది. దీంతో సినిమాల్లో చిరంజీవి పుంజుకోవడం ముఖ్యమంత్రి వ్యతిరేకులకు బాగా కలిసి వచ్చిందని భావిస్తున్నారు. చంద్ర బాబు సూచనలతోనే పవన్ గుంటూరులో జరిగిన ఖైదీనెం.150 ప్రీ రిలీజ్ కార్యక్రమానికి పవన్‌కల్యాణ్ డుమ్మాకొట్టారని విమర్శలు ఉన్నాయి. ఇన్నాళ్లూ చిరంజీవి సైలెంట్‌గా ఉండటంతో పవన్‌స్టార్...పవర్‌స్టార్ నినాదాలే వినిపించాయి. ఇప్పుడు ఈ నినాదాలకు బ్రేకులు పడనున్నాయి. తొమ్మిదేళ్ల విరామంతర్వాత బరిలో నిల్చిన చిరంజీవి క్రిష్ దర్శకత్వంలోని బాలకృష్ణ సినిమాను విజయవంతంగా ఎదుర్కొని సత్తా చాటడంతో పవన్ కాస్త కంగారు పడవలసిన విషయమే.. ఈ నేపథ్యంలో గురువారం చిరంజీవిని కలిసి పవన్ ముచ్చటించినట్లు వార్తలు వచ్చినా అవి నిజం కాదని తెలిసింది. కుర్రహీరోలు సాధించలేని రికార్డులను మెగాస్టార్ అందుకోవడం విశేషం. చిరంజీవితో ఎడమొహం పెడమొహంగా ఉన్న దాసరి నారాయణలాంటి పెద్దలను కూడా ఆయన మళ్లీ వెనక్కుక తెచ్చుకున్నారు. ఈ క్రమంలో చిరంజీవి అటు చిత్రపరిశ్రమలోనూ, ఇటు రాజకీయాల్లోనూ తన బలాన్ని నిరూపించు కుంటానికి సిద్దంగా ఉన్నారనిపిస్తోంది. తండ్రి సినిమాకు హైప్ తెస్తారని భావించిన చరణ్‌తేజ స్వయంగా చిన్నాన్న పవన్‌కల్యాణ్‌ను పిలిచినా రాకపోవడం అయినా సినిమా సక్సెస్ కావడం మెగాస్టార్‌కు కలిసి వచ్చిన అంశాలుగా మారబోతున్నాయి. పవన్‌ట్వీట్లు తప్ప ఏం చేయలేక పోయినా, అల్లు అరవింద్ ఎప్పటిలానే అన్నీతానై చేసుకుపోవడం సినిమాను విజయపథంలో నిలబెట్టడంతో మెగా ఫ్యామిలీలో మిగతానటులకు కూడా అల్లు స్టామినా ఎంటో తెలిసివచ్చింది. ప్రీ రిలీజ్ వేడుక నుంచి సినిమాహాళ్ల, ప్రస్తుతం విజయోత్సవ సభలవరకు అల్లు అరవింద్ తన వ్యూహాన్ని చక్కగా అమలుచేస్తున్నారు. ఈ పరిస్థితులో కాటమరాయుడు సినిమా ఏమాత్రం అటు ఇటూ అయితే పవన్ కల్యాణ్ పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారుతుంది. ఎందుకంటే రాజధాని ప్రాంత రైతులు తమ సమస్యలపై స్పందిస్తాడని చాలా ఎదురు చూశారు. రాష్ట్రంలోని యువత అంతా పవన్ రాష్ట్రానికి ప్రత్యేక హోదాకోసం కేంద్రంపై యుద్ధం ప్రకటిస్తారేమో అనుకున్నా... ఏదో షూటింగ్ గ్యాప్‌లో రెండు చోట్ల సభలు పెట్టడం మినాహా దానిమీద ప్రత్యేక శ్రద్ధ ెట్టలేదు. ఉద్దానం విషయం కొస్తే అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రోగుల విషయాలను తెలుసుకొని ఆదుకొండని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం మినహా ఆర్థికంగా పవన్ ఏమీ చేయలేక పోయారు. ఇప్పటికే కాపుల్లో చాలా మటుకు వ్యతిరేకత ఉందని గుర్తించిన ప్రభుత్వం రోగులు కోసం కాస్త పని చేసినట్లు ప్రవర్తిస్తోంది. రెండు రోజుల క్రితం అమరావతి,పోలవరం నిర్వా సితులు పవన్‌ను కలిసి వారి గోడు వినిపిస్తే ఆయన ఎంత ఉదాసీన వైఖరితో ప్రవర్తించారో టీవీల్లో చూసిన వారందరికీ తెలసింది. ఆయన పార్ట్‌టైమ్ రాజకీయనాయకుడు. ఎవరైనా పూర్తికాలం రాజకీయ నాయకుడిగా రావాలని కోరినా నా దగ్గర డబ్బులు లేవని మీరే పోషించుకోవాలంటూ ఆయన పేద రుపులు ఏకరువుపెడతారు. ఈ సమయంలో ఆయన ముందుచూపుతో ప్రవర్తించకపోతే రాజకీయాల్లోనూ, ఫ్యామిలీలోనూ ఆయన వంటరిగా మారక తప్పదు. ఇప్పటికైనా ఆయన తన రాజకీయ పంథాను మార్చుకొని సినిమాల్లో మాదిరిగా రాజకీయాల్లో కూడా చురుగ్గా పాల్గొని, ప్రజాపక్ష పోరాటాల్లో పాల్గొని ఎన్నికల ప్రచారంలో ఆయన ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చుకోవడం మంచిది. లేదంటే అధోగతే..


# పవన్‌తో గోడువెళ్లగక్కిన అమరావతి, పోలవరం రైతులు

**హైదరాబాద్ :** కృష్ణానది లంక గ్రామాలకు చెందిన దళిత రైతులు, పోలవరం గ్రామమూలలంక రైతులు తాము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాల వల్ల ఎలా నష్టపోతున్నది జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు వివరిస్తూ విలపించారు. హైదరాబాద్‌లోని జనసేన పరిపాలనా కార్యాలయంలో రైతులు పవన్‌ను కలిసి ఎలా అన్యాయానికి గురవుతున్నది వివరించారు. నూతన రాజధాని అమరావతి కృష్ణానది ఒడ్డున ఉన్న లంక గ్రామాలైన ఉద్దండరాయుని పాలెం, లింగాయపాలెం, తాళ్లాయపాలెం, మందడం, రాయపూడి, బోరుపాలెం, వెంకటపాలెం, ఉండవల్లి గ్రామాలకు చెందిన 3500 ఎకరాలను అమరావతి నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం సేకరించింది. ఇవన్నీ అసైన్డ్ భూములు. 1954, 1974లో ప్రభుత్వం వీరికి పట్టాలు ఇచ్చింది. ఈ భూములను గత నాలుగు తరాలుగా దళితులు సాగు చేసుకుంటున్నారు. ఎక్కువశాతం స్వాధీనం చేసుకున్న భూములకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంలో తీవ్రమైన వివక్షత చూపుతోందని దళిత రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సేకరించిన భూములకు రూ.50 వేలు కౌలు, 1450 గజాల స్థలం మాత్రమే ఇస్తుండగా తమకు మాత్రం 600 గజాల స్థలం మాత్రమే ఇస్తామంటున్నారని, అది కూడా లాటరీ పద్ధతిలో కాకుండా ఎక్కడో తమకు ఇష్టమైన చోట ఇస్తామని చెబుతున్నారని వారు వివరించారు. దళితులు ఇప్పటి వరకు విచక్షణకు గురవుతూ ఊరికి చివరే ఉన్నారని, ఇప్పుడు కూడా తాము రాజధానికి చివరనే


మీడియాతో మాట్లాడున్న పవన్

ఉండాలా అని వారు ప్రశ్నిస్తున్నారు. దళితులు పట్ల ఇటువంటి వివక్ష బ్రిటీష్ కాలంలో కూడా లేదని విమర్శించారు. పవన్ కల్యాణ్ దృష్టికి తమ సమస్యలు తీసుకెళితే పరిష్కారం దొరుకుతుందనే ఆశతో వచ్చామని వారన్నారు. తమ గ్రామాలకు వచ్చి తమకు న్యాయం జరిగేలా చూడాలని దళిత రైతులు పవన్‌ను కన్నీటితో ఆహ్వానించారు. పశ్చిమగోదావరి జిల్లా పోలవరం శివారు మూలలంక రైతుల కష్టం మరోరకంగా ఉంది. ఈ గ్రామంలోని 207 ఎకరాలు బలవంతపు అన్యాక్రాంతంలో ఉన్నాయి. 148 సన్న, చిన్నకారు రైతులకు చెందిన ఈ భూముల్లో పోలవరం ప్రాజెక్టు కోసం తవ్వగా వచ్చిన మట్టిని ఈ 207 ఎకరాలలో ప్రాజెక్టు కాంట్రాక్టర్ దిమ్మరిస్తున్నాడు. నిజానికి ఈ మట్టిని ప్రాజెక్టుకు దూరంగా కేటాయించిన 400 ఎకరాల బీడు భూముల్లో పోయాల్సివుంది. అయితే అక్కడకు రవాణా చార్జీలు ఎక్కువ అవుతాయన్న కారణంగా పక్కనే విలువైన మాగాణి భూమిలో మట్టిని కాంట్రాక్టర్ పోయిస్తున్నాడు. ఇదెక్కడి అన్యాయమని ప్రశ్నస్తే పలికే నాదుడే లేదని రైతులు ఆవేదనను వ్యక్తం చేశారు. కలెక్టర్ నుంచి నీటి పారుదల శాఖ మంత్రి వరకు ఎవరినీ కలిసినా తమకు న్యాయం జరగడం లేదని వారు మొరపెట్టుకున్నారు. మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరినా ఫలితం లేదన్నారు దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్ మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజాసంక్షేమం రెండూ జనసేన ముఖ్యవిధానాలన్నారు. అభివృద్ధి పనులు ఆగకూడదని, అలాగే ప్రజలు కూడా నష్టపోరాదన్నారు.

వృద్ధుల ఆధారంగా ఏర్పడిన మనకుల వ్యవస్థలో ప్రభుత్వం తీసుకొనే కొన్ని అనాలోచి నిర్ణయాల వల్ల కులమూలలకు నష్టం కలిగే అవకాశం, ఉందని, దీని వల్ల కులాల మధ్య ఘర్షణలు జరిగే ప్రమాదం ఉందని పవన్ కల్యాణ్ భయాందోళనను వ్యక్తం చేశారు. అందువల్ల ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకునేందుకు ముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ రెండు ప్రాంతాల రైతులు ఇచ్చిన విజ్ఞాపన పత్రాలను కులంకుషంగా పరిశీలించి పార్టీలో చర్చించి ఏమి చేయాలో నిర్ణయిస్తామని చెప్పారు. తన రాక అవసరమైన పక్షంలో రెండు ప్రాంతాల్లో పర్యటిస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.


సూర్యాస్తమయంలో కనువిందు చేస్తున్న విజయవాడ కృష్ణానది అందాలు

## మైనారిటీలు జీవితాల్లో వెలుగు నింపాలి

**హైదరాబాద్ :** మైనారిటీల అభ్యున్నతి, సంక్షేమం కోసం ప్రభుత్వం యుద్ధప్రాతిదికన చర్యలు చేపట్టాలని శాసనమండలి సభ్యులు ఎంఎస్.ప్రభాకరరావు విజ్ఞప్తి చేశారు. దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న అత్యంత నిరుపేదలైన ముస్లిం, మైనారిటీలను నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఖర్చు కాకపోవడం బాధాకరమన్నారు. మైనారిటీల సంక్షేమంపై జరిగిన లఘు చర్చల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దళితులు గిరిజనుల కంటే అత్యంత పేదరికంలో ముస్లింలు మగ్గుతున్నారని ఆయన చెప్పారు. జస్టిస్ రాజేంద్రసింగ్ సచార్ సిఫార్సులను అమలు చేసి ముస్లింల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. ముస్లింల స్థితిగతులను మార్చేందుకు అనేక కమిటీలు వేసినా అమలుకు నోచుకోవడం లేదన్నారు.

## మరికొంతమంది ఇమామ్‌లకు గౌరవవేతనం

పల్లె రఘునాథరెడ్డి

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్రంలో కొత్తగా 2,500 ఆదాయం లేని మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజమ్‌లకుగౌరవవేతనాన్ని వచ్చేనెల నుంచి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 2,500 మసీదుల్లో పనిచేసే ఇమామ్‌లకు గౌరవవేతనం ఇస్తున్నామన్నారు. ఇమామ్‌లకు రూ. 5000, మౌజమ్‌లకు రూ. 3000 గౌరవవేతనంగా ఇస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 8 కోట్లు కేటాయించిందన్నారు. వక్ఫ్ సంస్థలకు సంబంధించిన ఆస్తులన్నింటికీ జియోట్యాగ్ చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

## రూ.6 కోట్లతో మహిళలు ఉపాధిశిక్షణ కార్యక్రమాలు

**రాజధాని ప్రతినిధి- కొయ్యలగూడెం :** అన్నంరెడ్డి సుబ్బారావు, : రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోను 500 మంది వంతున కాపుయువత మహిళలకు ఉపాధినిమిత్తం కుట్టుశిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కాపుకార్పోరేషన్ ద్వారా ఎ.పి.మహిళసహకార ఫైనాన్స్ కార్పోరేషన్‌కు రూ.6కోట్లును కేటాయించినట్లు ఆ కార్పోరేషన్ డైరెక్టర్లు వై.వి.రాజేశ్వరి, గంగిరెడ్ల మేఘలాదేవి తెలిపారు. కొయ్యలగూడెంలో మేఘలాదేవి ఇంటివద్ద వారు విలేకర్లతో మాట్లాడారు. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సుగల కాపుయువతలు, మహిళలకు ఈ కార్యక్రమంలో ఉచితంగా కుట్టుశిక్షణ ఇవ్వటంతో పాటు శిక్షణ తర్వాత వారికి కుట్టుమిషన్‌లను ఉచితంగా పంపిణీచేయిచటం జరుగుతుందని వారు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో తడికెలపూడి మహిళ ప్రాంగణం, కొయ్యలగూడెం, పాలకొల్లు, అత్తిలిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహళల ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలో శిక్షణలు ఇవ్వటానికి ఏర్పాటు చేసిన మహిళా ప్రాంగణాలు పదేళ్ల కాంగ్రెస్ పాలనలో మూలనపడ్డాయని వారు పేర్కొన్నారు. మళ్లీ ఇప్పుడు తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళా ప్రాంగణాల ఆధునిక రవాణకు, భవనాల మరమ్మతులకు


ఎ.పి. మహిళ సహకార ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్లు వై.వి. రాజేశ్వరి గంగిరెడ్ల మేఘలాదేవి కొయ్యలగూడెంలో విలేకర్లతో మాట్లాడుతున్న దృశ్యం

దృష్టిపెట్టినట్లు తెలిపారు. మహిళలకు డ్రైవింగ్, కంప్యూటర్‌లలో శిక్షణ ఇప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఇంగ్లీష్ మీడియం పాఠశాలలుగా తీర్చిదిద్దాటానికి ప్రభుత్వం సంకల్పించిన నట్లు చెప్పారు. తడికెలపూడి మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ ఎం. ఉమాదేవి, యం.డి శ్రీదేవి కూడా పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో త్వరలో సర్కారు దుకాణం బంద్

సచివాలయంతో పాటు ఇతర భవనాలన్నీ అప్పగింత

**రాజధాని ప్రతినిధి ,(అమరావతి) :** పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను రాష్ట్ర పునర్విభజన చట్టంలోనే పేర్కొన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీలైనంత త్వరగా హైదరాబాద్‌లో సర్కారు దుకాణాలను బంద్ చేసేయాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లో ఏపీకి కేటాయించిన సచివాలయ భవనాలతో పాటు ఇతర శాఖాధిపతుల కార్యాలయాలు, తొమ్మిది, పదో షెడ్యూల్ సంస్థలున్న కార్యాలయాలను తెలంగాణ సర్కారుకు అప్పగించేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే హైదరాబాద్‌లోని సచివాలయ భవనాలతో పాటు ఇతర ప్రభుత్వ భవనాలన్నింటినీ తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించేయాలని చంద్రబాబునాయుడు ప్రతిపాదించారు. హైదరాబాద్‌లోని ఏ కార్యాలయానికి చెందిన ఆస్తుల్లోను వాటా ఇచ్చేది లేదని తెలంగాణ సర్కారు చెబుతున్న సమయంలో వెంటనే కార్యాలయాలను అప్పగించేస్తే తప్పుడు సంకేతాలతో పాటు వ్యతిరేకత వ్యక్తమవుతుందని మంత్రులు పేర్కొన్నారు. దీంతో మంత్రులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత ఏడాది నవంబర్ 11న ఇద్దరు ఉపముఖ్య మంత్రులు కేఈ కృష్ణమూర్తి, చినరాజప్ప , ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, వైద్య ఆరోగ్యశాఖమంత్రి కామినేని శ్రీనివాస్, కార్మిమంత్రి అచ్చెన్నాయుడులతో కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో ఇచ్చారు. మళ్లీ ఇటీవల కార్యాలయాల అప్పగింత వీలైనంత త్వరగా జరగాలని ముఖ్యమంత్రి భావించారు. పాలనా ఇబ్బందుల పేరుతో హైదరాబాద్‌లో ఉన్న తొమ్మిది, పదో షెడ్యూల్స్‌లోని కార్యాలయాల ఉద్యోగులంతా తక్షణం నూతన రాజధాని ప్రాంతానికి వచ్చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో ఇంతకుముందు ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీని ప్రభుత్వం రద్దుచేసింది. తాజాగా భవనాల అప్పగింతతో పాటు రాష్ట్ర పునిర్విభజన చట్టంలోని అంశాలపై కొత్తగా మంత్రులు యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, ప్రభుత్వ చీఫ్ విప్ కాల్వ శ్రీనివాసులతో కమిటీ ఏర్పాటు చేస్తూ జీవో జారీచేసింది. గత మంత్రుల కమిటీలో ఉన్న ఇద్దరు డిప్యూటీ సీఎంలకు, మంత్రి కామినేనికి కొత్త కమిటీలో స్థానం కల్పించలేదు.


కొయ్యలగూడెం సంక్రాంతి సంబరాల్లో దేదీప్య శ్రీ లక్ష్మిని లాలిస్తున్న మాజీ కేంద్ర మంత్రి పురందరేశ్వరి

## నియోజకవర్గంలో 350 గృహాలు నిర్మాణం

**అన్నంరెడ్డి సుబ్బారావు. రాజధాని ప్రతినిధి.కొయ్యలగూడెం :** ప్రధాన మంత్రి ఆవాసయోజన పథకం కింద పోలవరం నియోజకవర్గానికి 350 నివాస గృహాలు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్ రావు చెప్పారు. వాటిలో కొయ్యలగూడెం మండలానికి 107 గృహాలు కేటాయించారని. ఆయన తెలిపారు. ఒక్కొక్క గృహానికి 2 లక్షల రూపాయలు మంజూరుయ్యాయని. ఆ రెండు లక్షలు 1 లక్షా 82 వేల రూపాయలను ప్రభుత్వం లబ్దిదారులకు ఉచితంగా ఇస్తుందని మిగిలిన 18వేల రూపాయలను లబ్దిదారుడు వాటాగా భరించవలసి ఉంటుందన్నారు. 2011 సంవత్సరంలో సోషి మో ఎకనామిక్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ గృహాలకు అర్హులైన లబ్దిదారులను గుర్తించారని అప్పటి సర్వేలు ఆనాడు గుర్తించిన లబ్దిదాలకే పి.ఎం.ఎ.వై పథకంలో గృహాలు నిర్మాణ జరుగుతుందని ఎం.ఎల్.ఏ వివరించారు. నిమోజకవర్గనికి మంజూరైన గృహలలో 60 శాతం గృహాలను ఎస్.సి.ఎస్.టి.వర్గాల వారికి 2011 సర్వేలోను కేటాయిచటం జరిగిందని, ఆ దామాషా ప్రకారమే ఇప్పుడు ఇళ్లకు నిర్మించటం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అయితే 2011 నాటి సర్వే జాబితాలోని లబ్దిదారులలో కొందరు చనిపోవంటం జరిగిందని, మరికొందరు స్వయంగా గృహాలు నిర్మించుకున్నట్లు గుర్తించినట్లు అధికారులు చెపుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఉన్నతాధికారులు సూచనల ప్రకారం లబ్దిదారుల గుర్తింపు జరిపి ఇళ్లను నిర్మించుకున్నట్లు గృహ నిర్మాణశాఖ అధికారులు చెప్పారు. ఎన్.టి.ఆర్ గృహాలు పథకాలలలో మండలలో ఈ ఏడాది 294 ఇళ్లు మంజూరుమ్యాయని, ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.1.50 లక్షలు ఉచితంగా ఇస్తుందని చెప్పారు. ఎన్.టి.ఆర్. గృహాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.

## 26 దరఖాస్తులకు ఏపీసీఆర్‌డీఏ అనుమతి

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** ఏపీసీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించిన ఓపెన్ ఫోరంలో భవనాలు, లేఆవుట్ల దరఖాస్తులను అధికారులు పరిశీలించి అన్ని నింబంధనలు పాటించిన వారికి ప్రాథమిక అనుమతి మంజూరు చేశారు. పారదర్శకంగా త్వరిత గతిన అనుమతులు మంజూరు చేయడంలో భాగంగా చేపట్టిన ఓపెన్‌ఫోరం నిర్మాణదారులకు సౌకర్యవంతంగా మారింది. అన్ని నిబంధనలు పాటించి, సంబంధిత పత్రాలన్నీ జతచేసి లైసెన్స్‌డ్ సర్వేయర్ ద్వారా దరఖాస్తులు సమర్పిస్తే అనుమతులు సులువుగా మంజూరు అవుతాయని కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ చెప్పారు. ఓపెన్ ఫోరంలో మొత్తం 30 దరఖాస్తులు రాగా, నింధనలకు అనుగుణంగా 26 దరఖాస్తులను అప్పటికప్పుడే ఆమోదించి ప్రాథమిక అనుమతి పత్రాలు అందించారు. మరో 4 దరఖాస్తులకు అదనపు సమాచారం కోరారు. భవన నిర్మాణ అనుమతుల కోసం 10 దరఖాస్తులు రాగా 8 దరఖాస్తులకు అనుమతి మంజూరు పత్రం జారీ చేశారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం 7 దరఖాస్తులు రాగా అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న 6 దరఖాస్తులను ఆమోదించారు. 1 దరఖాస్తుకు అదనపు సమాచారం కోరడం జరిగింది. లేఅవుట్ల అనుమతుల కోసం 10 దరఖాస్తులు రాగా అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న 10 లే అవుట్లకు అప్పటికప్పుడే ప్రాథమిక అనుమతి పత్రం మంజూరు చేయడం జరిగింది. పరిశ్రమల అనుమతుల కోసం 3 దరఖాస్తులు రాగా నిబంధనలకు అనుగుణంగా ఉన్న 2 దరఖాస్తులకు ప్రాథమిక అనుమతి మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఆర్‌డీఏ డెవలప్‌మెంట్ ప్రమోషన్ విభాగం డైరెక్టర్ వి. రాముడు, ప్లానింగ్ ఆఫీసర్ సిహెచ్.వి. సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్.టి.ఆర్.కు 'భారతరత్న' ఇవ్వాలి

**రాజధాని ప్రతినిధి-కొయ్యలగూడెం-అన్నంరెడ్డి సుబ్బారావు :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీముఖ్యమంత్రి దివంగత ఎన్.టి. రామారావుకు భారతరత్న ఇవ్వాలని, దేశంలో పేదల అభివృద్ధికి సంక్షేమపథకాల సృష్టికర్తగా, రాజకీయపు స్వీకరణతో దేశరాజకీయలను దశ, దిశలను మలుపు తిప్పిన మహానాయకుడు అయన ఎన్.టి.ఆర్.ను దేశ అత్యున్నత పురస్కారాన్ని ఇచ్చి గౌరవించుకోవలసిన అవసరం ఉందని పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు అన్నారు. ఎన్.టి.ఆర్. వర్ధంతి సందర్భంగా కొయ్యలగూడెంలో నిర్వహించిన కార్యక్రమాలలో అయన పాల్గొన్నారు. తొలుత ఎన్.టి.ఆర్. విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక కాకర్ల షాపింగ్ కాంప్లెక్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్.టి.ఆర్. ఆశయాలను సి.యం. చంద్రబాబు ప్రభుత్వం కొనసాగిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. జడ్.పి. ఎ. ఉపాధ్యక్షుడు చింతల వెంకట రమణ, పార్టీ సీనియర్ నాయకుడు అయన పర్తిశోభనబాబు తదితరులు రక్తదానం చేసారు. ఎం.పి.పి. అయన పర్తిచందన శ్రీదేవి, ఎ.ఎం.సి. చైర్మన్ పారే పల్లి రామారావు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పారేపల్లి శ్రీనివాస్, మాజీ ఎం.పి.పి. మట్టాసత్తిపండు మంతెనసోమరాజు ఎం.పి.టి.సి. సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. పొంగుటూరు, రాజవారం, దివృకాయలపాడు, సరిపెల్లి గ్రామాలలో కూడా స్థానిక పార్టీ నాయకులు, ఎం.పి.టి.సి. సభ్యులు ఎన్.టి.ఆర్.విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రాజధాని వార్తలు ప్రాంతీయ కార్యాలయం ఏలూరు
ప్యారడైజ్ కర్రీ పాయింట్ ప్రాంగణం, 2టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన, నరసింహారావుపేట
ఏలూరు -534006

# సాహసమే శ్వాసగా ...

**25 మందికి జాతీయ బాలల అవార్డులు ...23 న ప్రదానం**



**న్యూఢిల్లీ :**

కష్టం ఎదురయినపుడు ధైర్యాన్ని, ఇతరులకు సాయంచేయాల్సి వచ్చినపుడు తెగువని ప్రదర్శించినవారికి యేటా అందించే జాతీయ సాహస బాలల అవార్డులను కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. నదిలో కొట్టుకుపోతున్న తన స్నేహితులను ప్రాణాలు పణంగా పెట్టి కాపాడిన అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన బాలిక తార్ పీజు(8)కి మరణానంతరం అవార్డు ప్రకటించగా, మృత్యువుకి ఎదురెల్లి మరీ మానవ అక్రమ రవాణా రాకెట్‌ని బద్దలుకొట్టిన తేజాశ్వేత ప్రధాన్(18), శివానీ గోండ్ (17) అనే ఇద్దరు బెంగాలీలు గీతా చోప్రా పురస్కారానికి ఎంపికయ్యారు. చిరుతపులితో హోరా హోరీ పోరాడిన ఉత్తరాఖండ్‌కు చెందిన సుమిత్‌కు సంజయ్ చోప్రా అవార్డు లభించింది. ఇలా 207 సంవత్సరానికి 25 మంది బాలలను ఈ అవార్డుకి ఎంపిక చేశారు. వీరిలో నలుగురికి మరణానంతరం అవార్డు లభించనుంది. దేశ రాజధానిలో ప్రధానమంత్రి చేతుల మీదుగా ఈ నెల 23 వ తేదిన విజేతలకు అవార్డులు ప్రదానం చేస్తారు.



**ఆ నాలుగు గంటలు నరకమే!**

అమ్మాయిలను ట్రాప్‌చేసి, వేశ్యాగృహాలకు, విదేశాలకు అమ్మేముఠా ఆటని ఇద్దరు అమ్మాయిలు కట్టించారు. సరిహద్దుల్లో యథేచ్చగా సాగుతున్న మానవ అక్రమ రవాణాని అడ్డుకోవడానికి పోలీసులు,సీబీఐ అధికారులు చేయని ప్రయత్నం లేదు. అలాంటిది నిండా ఇరవై ఏళ్లు కూడా లేని తేజాశ్వేత, శివానీ ముఠా నాయకుడు సహా మొత్తం రాకెట్‌ని బద్దలుకొట్టేశారు. మార్గ్ అనే డార్జిలింగ్ కేంద్రంగా గల ఎన్జీవోలో సభ్యులుగా ఉన్నవీరు.. తప్పిపోయిన ఓ నేపాలీ బాలిక కేసును చేపట్టారు. పథకంలో భాగంగా, ఓ ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్‌ని తెరిచి..తప్పిపోయిన అమ్మాయితో చాటింగ్ చేశారు. ఈ క్రమంలో ఆ బాలిక ముఠాలో కలిసిపోయినట్లు గ్రహించారు. తాము ఖాళీగా ఉన్నామని, ఏ పనైనా చేస్తామంటూ పోస్టుపెట్టారు. తాను చెప్పిన హోటల్‌కు వస్తే ముఠాసభ్యులను కలిపిస్తానని ఆ బాలిక వారిని రప్పించింది. ఢిల్లీలోని ఓ హోటల్‌కు ఇద్దరూ చేరుకొన్నారు. 'గంటా.. రెండు గంటలు.. మూడు గంటలు ... సమయం గడిచిపోతోంది. అక్కడకు ఎవరూ రాలేదు. గంటల ముల్లు కదులుతున్న కొద్దీ మాలో భయం పెరుగుతోంది. నాలుగు గంటలపాటు నరకం చూశాం. ఎక్కడైనా తేడా వస్తే...కాపాడే వారు ఉండరు. ఇంతలో మాతో ఛాటింగ్ చేసిన బాలిక, ముఠా సభ్యులు, వారి నేత అక్కడికొచ్చి దొరికిపోయారని వారు వివరించారు.

**మునిగిపోతున్న వారిని కాపాడి...**

కశ్మీర్‌లో నదిలో కొట్టుకుపోతున్న ఇద్దరు చిన్నారులను పాయల్ దేవీ కాపాడింది. వారిని ఒడ్డుకు చేర్చే క్రమంలో తన ప్రాణాలను బలి ఇచ్చింది. అలాంటిదే మరో ఘటనలో.. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన తార్ పీజు ...నదిలో మునిగిపోతున్న స్నేహితులను కాపాడి. ప్రాణాలు వదిలింది.

**అక్కాతమ్ముళ్ల సాహసానికి....**

ఢిల్లీకి చెందిన అక్షిత, ఆక్షిత్ శర్మ... తమ ఇంట్లోకి చొరబడిన దొంగలను ధైర్యంగా ఎదుర్కొన్నారు. అక్కా తమ్ముళ్లు కలిసికట్టుగా. దొంగలను ఒక పట్టు పట్టారు. ఏది దొరికితే అది తీసుకొని వెంటపడ్డారు. దాడిలో తీవ్రంగా గాయపడిన దొంగలను బంధించి పోలీసులకు అప్పగించారు.



విజయవాడ జవహర్ ఆటోనగర్‌లో రాజధాని వార్తలు 2017 కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ టీడీపీ వాణిజ్య విభాగం ప్రధానకార్యదర్శి వెలగపూడి శంకర్ బాబు, పెనమలూరు టీడీపీ కార్యదర్శిఎం.డి సిద్ధిక్, కానూరు వైస్‌ప్రెసిడెంట్ అబ్దుల్ లతీఫ్,డాక్టర్ ఖాన్ ఖుదా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఎం.డి. అమీన్, ఎం.డి.బేగ్, షేక్ వలి, బఫీర్, జలీల్, ముస్లీం పెద్దలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా లోకేశ్?

**త్వరలో శాసనమండలికి ఎన్నిక.. ఆపై మంత్రి వర్గంలోకి !**



**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తనయుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ త్వరలో ప్రజా ప్రతినిధి కానున్నారు! మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో జరిగే శాసనమండలి ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికవనున్నట్లు సమాచారం. రాష్ట్రంలో త్వరలో 22 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందులో ఎమ్మెల్యేల కోటా నుంచి ఏడు సీట్లకు ఎన్నిక జరగనుంది. ఎమ్మెల్యేలు ఈ ఎమ్మెల్సీలను ఎన్నుకోవాల్సి ఉంది. ప్రస్తుత సంఖ్యాబలాన్ని బట్టి ఇందులో పాలక టీడీపీకి ఆరు, వైసీపీకి ఒకటి లభించే అవకాశముందని అంటున్నారు. ఎమ్మెల్యేలు కోటా నుంచే లోకేశ్ ఎన్నికవుతారని తెలిసింది. లోకేశ్ చట్టసభలోకి ఎమ్మెల్సీగా వస్తే బాగుంటుందా లేక ఎమ్మెల్యేగా వస్తే బాగుంటుందా అన్నదానిపై కొంత కాలం క్రితం పార్టీలో చర్చ జరిగింది. ఎమ్మెల్యేగా వస్తే బాగుంటుందని కొందరు అభిప్రాచపడ్డారు. కానీ ప్రస్తుతం ఎమ్మెల్యే సీట్లేవీ ఖాళీగా లేవు. ఎవరితోనైనా రాజీనామా చేయించి ఆయన్ను పోటీ చేయించాల్సి ఉంటుంది. వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన చిత్తూరు జిల్లా పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్ రెడ్డి తాను రాజీనామా చేస్తానని ముందుకొచ్చారు. అక్కడి నుంచి లోకేశ్‌తో పోటీచేయించాలిని ప్రతిపాదించారు. ఈ స్థానం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంకు ఆనుకుని ఉంది. తండ్రీకొడుకుల సీట్లు పక్కపక్కన ఉండడం సరికాదన్న అభిప్రాయంతో ఈ ప్రతిపాదనను పక్కన పెట్టారు. లోకేశ్ కోసం పనిగట్టుకొని ఒక ఎమ్మెల్యేతో రాజీనామా చేయించి ఉప ఎన్నిక జరపడం సరైన సంప్రదాయం కాదని కొందరు సీనియర్లు అభిప్రాయపడ్డారు. దానిబదులు ఎమ్మెల్సీగా చట్ట సభలోకి తీసుకురావడం మంచిదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికల్లో నిలబెట్టవచ్చని వారు చంద్రబాబుకు సూచించారు. ఆయన కూడా అందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. కొత్త ఆలోచనలేవీ ముందుకు రాని పక్షంలో వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో లోకేశ్ నిలబడడం.. చట్టసభలోకి అడుగుపెట్టడం ఖాయమని అంటున్నారు. ఈ సారి మంత్రివర్గ విస్తరణలో లోకేశ్‌కు చోటు కల్పించబోతున్నారని ఇప్పటికే స్పష్టమైంది. మంత్రివర్గంలోకి చేరడానికి ముందో.. చేరిన ఆరు నెలలలోపో ఆయన ఏదో ఒక చట్టసభలో సభ్యుడు కావలసి ఉంటుంది. విస్తరణకు ముందే ఎమ్మెల్సీ ఎన్నికలు ఉంటాయని, అందులో ఆయన ఎన్నికవుతారని పార్టీ వర్గాలు అంటున్నాయి. చంద్రబాబు మంత్రవర్గంలో ప్రస్తుతం శాసనమండలి నుంచి యనమల రామకృష్ణుడు, పి.నారాయణ మంత్రులుగా ఉన్నారు. రాజకీయ అవసరాలను బట్టి మండలి నుంచి మరో ఒకరిద్దరికి అవకాశం ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది.

## శ్రీలంక విద్యపై గంటా టీమ్ ఆసక్తి

**కొలంబోలో మంత్రులు అధికారులతో భేటీ**




**హైదరాబాద్ :** నవ్యాంధ్రలో మెరుగైన విద్యావిధానాలను ప్రవేశపెట్టడమే ధ్యేయంగా రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు శ్రీలంకలో పర్యటిస్తున్నారు. ఆయన నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం మంగళవారం కొలంబో చేరుకుంది. సెంట్రల్ ప్రావిన్స్ సీఎం, విద్యాశాఖ మంత్రి శరత్ ఇక్కనాయకేతో మంత్రి గంటా సమావేశమయ్యారు. అనంతరం శ్రీలంక యూనియన్ విద్యాశాఖ మంత్రి అఖిల విరాజ్ కరియవాసం, విద్యాశాఖ కార్యదర్శి తిస్సా హివనితనతో గంటా బృందం భేటీ అయింది. 18 ఏళ్లు వచ్చే వరకు నిర్బంద విద్యావిధానం, ప్రతి ఒక్క విద్యార్థికి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ, ఇక్కడి మదరసాల మాదిరిగా అక్కడ బౌద్ధులకు పాఠశాల విద్యను అందించే పద్ధతులు, మధ్యాహ్న భోజన పథకంపై వారు చర్చించారు. జీడీపీలో విద్యకు ఆరుశాతం కేటాయిస్తున్నట్లు శ్రీలంక విద్యాశాఖమంత్రి..గంటాకు తెలిపారు. కాగా, అక్కడి పాఠశాలల్లో మాతృభాష మాధ్యమంగా విద్యావిధానం ఉండటాన్ని మంత్రి బృందం గుర్తించింది. టీచర్ల ఎంపిక పారదర్శకంగా ఉండటానికి గల కారణాలను, దానికి అనుసరిస్తున్న నియామక ప్రక్రియను అధ్యయనం చేసింది. శ్రీలంకలో మొత్తం 41 లక్షల మంది విద్యార్థులు ఉండగా, 2.3లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. తరగతి గదిలో విద్యాబోధనా పద్ధతులపై సుదీర్ఘంగా చర్చించింది.

# వివాదాల్లో విశాఖ ఎమ్మెల్యేలు

- అక్రమ భవన నిర్మాణాల్లోవాసుపల్లి,పీలా
- గోడ కూల్చిన కేసులో ఎమ్మెల్యే గోవింద్
- ఇండియన్ బ్యాంకు ఆస్తుల స్వాధీన ప్రకటనతో డీలా పడ్డ గంటా

**విశాఖపట్నం :** విశాఖనగర తెలుగుదేశం పార్టీలో తీవ్ర అలజడి రేగుతోంది. మంత్రితోపాటు ఎమ్మెల్యేలు వివాదాల్లో చిక్కుకోవడం వివాదాస్పదంగా మారుతోంది. రెండున్నరేళ్లుగా దూకుడు ప్రదర్శించిన ఎమ్మెల్యేలు వరుసగా చట్టవిరుద్ధ ఘటనల్లో ప్రతికల కెక్కడంతో పార్టీ ప్రతిష్ఠ మసకబారిపోతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.రూ.140 కోట్ల రుణ ఎగవేతదారులకు హామీగా ఉన్న మంత్రి గంటా శ్రీనివాసరావు ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని ఇండియన్ బ్యాంకు యాజమాన్యం ప్రకటించడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాజాగా అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద్‌పై గోడ కూల్చివేత,వేధింపుల కేసు నమోదు కావడం చర్చనీయాంశమైంది. జీవీఎంసీ ఎన్నికలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్న సమయంలో ఇలా ఒక్కొక్కరిపై కేసులు నమోదు కావడంతో పార్టీ అధిష్ఠానం కలవరపడుతోంది. నగర పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు అధికార టీడీపీ, బీజేపీకి చెందిన వారే కావడంతో ఎన్నికల్లో తమకు తిరుగు లేదనుకున్న తరుణంలో ఈ మధ్య చోటు చేసకుంటున్న పరిణామాలు టీడీపీని పునరాలోచనలో పడేశాయి. మంత్రి గంటా తోడల్లుడు పరుచూరి భాస్కరరావు అన్నయ్య రాజారావు పేరుతో నగరంలోని డాబా గార్డెన్స్ ఇండియన్ బ్యాంకులో దాదాపు రూ.140 కోట్లు అప్పుగా తీసుకున్నారు. ఇందుకు ప్రత్యూష కంపెనీలోని గంటా శ్రీనివాసరావుతో సహా అరుగురు డైరెక్టర్లు ఆస్తులను హామీగా చూపించారు. రాజారావు అప్పు తీర్చకుండా మద్రాసు వెళ్లిపోయారు. వడ్డీతో కలిపి దాదాపు రూ.197 కోట్లు చెల్లించాలంటూ బ్యాంకు నుంచి డైరెక్టర్లకు నోటీసులు జారీ అయ్యాయి. అయినా స్పందించక పోవడంతో ఆస్తులు స్వాధీనం చేసుకుంటామని బ్యాంకు అధికారులు ప్రకటించారు. ఈ విషయం బయటకు పొక్కడానికి టీడీపీలోని గంటా ప్రత్యర్ధి వర్గమే కారణమన్న ప్రచారం సాగుతోంది. ఈ విషయం మరవక ముందే అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. పెందుర్తికి చెందిన ముమ్మన రాజేశ్‌బాబు అనే వ్యక్తి తన ఇంటి గోడను ఎమ్మెల్యే కుటుంబం కూల్చడమే కాకుండా అతని కుమారుడు శ్రీకాంత్ దాడికి పాల్పడ్డారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేయడంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయమై ఇంటెలిజెన్స్ ఎంక్వైరీకి ఆదేశించడం సంచలనమైంది. ఎమ్మెల్యే గోవింద్ తనకు అనుకూలమైన తహశీల్దార్ సీవీఎస్ పాండురంగా రెడ్డిని అనకాపల్లి నుంచి పెందుర్తికి బదిలీ చేయించుకున్నారన్న ఆరోపణలు తెరపైకి వచ్చాయి. పెందుర్తి మండలంలో ఆయన కుటుంబానికి ఉన్న స్థలాలన్నింటినీ క్రమబద్దీకరించుకునేందుకే తహశీల్దార్‌ను వినియోగించుకుంటున్నట్లు విమర్శలొస్తున్నాయి. అనకాపల్లిలోనూ ఆయన ఇదే పని చేశారన్న ప్రచారం ఉంది. అదే ఎమ్మెల్యే ద్వారకానగర్‌లోని బీవీకే కాలేజీరోడ్‌లో ఒక షాపింగ్ కాంప్లెక్స్ కోసం గెడ్డలో కొంత భాగాన్ని కలిపి కడుతున్నారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు జి.ఫ్లస్ 2కు అనుమతి పొంది జి ఫ్లస్ 4 భవనాన్ని నిర్మిస్తున్నారు. మరో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కూడా (15 వ వార్డు) వివాదంలో చిక్కుకున్నారు. జీవీఎంసీ జోన్ 2 కార్యాలయం వెనుక భాగాన 222.83 చ.మీ స్థలంలో జి.ఫ్లస్ 2 కు అనుమతి పొంది, జి ఫ్లస్ 4 భవనాలు నిర్మిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల అతిక్రమణలు ఇలా ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతో నగర ప్రజల మండిపడుతున్నారు. మిత్రపక్షం బీజేపీకి చెందిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీని మరింత ఇరకాటంలో పడేశాయి. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అవినీతిలో మొదటి స్థానంలో ఉందని బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. అవినీతి అధికారులను పట్టుకున్న ఏసీబీ సిబ్బందికి రూ. పదివేలు వంతున వంద మంది వరకూ బహుమతులు ఇస్తామన్నారు.టీడీపీ ప్రభుత్వంపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతకు విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలు అద్దంపడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగు తమ్ముళ్ల దందాలను నిలువరించపోతే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదంటున్నారు.

## దుబాయ్‌లో తొలి రోబో మెడికల్ షాపు




**దుబాయ్ :** రోబోల యుగం వచ్చేసింది. ప్రతి పనికీ సులువుగా ఉపయోగించే విధంగా రోబోలను తయారుచేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. వివిధ దేశాల్లో సెక్యూరిటీ గార్డు దగ్గర నుంచి బ్యాంకు కార్యకలాపాలు చూసే వరకు రోబోలను ఉపయోగిస్తున్నారు. తాజాగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్(యూఏఈ) తొలిసారిగా రోబోతో మెడికల్ షాపు ఏర్పాటు చేసింది. దుబాయ్‌లోని రషీద్ ఆసుపత్రిలో రోబో ఔషధ దుకాణం సేవలందించనుంది. రోగులకు వైద్యులు సూచించిన మందులను ఇకపై రోబోవారికి అందిస్తుంది. వైద్యులు సూచించిన మందుల మందుల చిటీ మీద ఉండే బార్‌కోడ్ ఆధారంగా ఎటువంటి లోపాలు లేకుండా కచ్చితంగా అవే మందులను రోబో ఇస్తుంది. దీని వల్ల మందుల పంపిణీ ఒక్కోసారి వ్యక్తులు చేసే తప్పులను సరిచేసుకోవచ్చని యూఏఈ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. రోబో ఫార్మసీలో దాదాపు 35 వేల మందుల నిల్వ ఉంటాయి. నిమిషం కంటే తక్కువ సమయంలో దాదాపు 12 మందుల చిటీలకు మందుల అందిస్తుంది. దీని వల్ల వినియోగదారులు మందులు కొనుగోలు చేసుకునేందుకు వేచి ఉండే సమయం తగ్గిపోతుంది. దుబాయ్ హెల్త్ ఆథారిటీ ఈ రోబో సదుపాయాన్ని అన్ని ఆసుపత్రుల్లోకి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.అధునాతన సాంకేతికను ఉపయోగించుకొని సంతోషకరమైన, ఆరోగ్యమైన సమాజాన్ని రూపొందించుకునేందుకు డీహెడ్ఏ ఈ ఆలోచనను చేసింది. ఇప్పటికే యూఏఈలోని పలు ప్రాంతాల్లో రోబో సర్వీసులు ఉన్నాయి. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాల్లో రోబోలు ప్రయాణికులకు సాదర స్వాగతం పలకడం, మానవ రహిత కారు ప్రయోగం. ఇటువంటి ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలకు దుబాయ్ వేదికైంది.

# యథేచ్ఛగా నిర్వహించిన కోడి పందేలు

- చేతులు మారిన రూ.2వేల కోట్లు?
- కోర్టు ఆదేశాలు బేఖాతరు
- ప్రేక్షక పాత్రలో పోలీసులు

**రాజధాని ప్రతినిధి, కాకినాడ :** కోడిపందేల చట్ట విరుద్ధమని, అదే సంప్రదాయమైతే.. కత్తి కట్టకుండా చేపట్టవచ్చునన్న ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఎక్కడా అమలైన దాఖలాలు లేవు. ఉభయ గోదావరితోపాటు కృష్ణాజిల్లాలోనూ యధ్వేచ్ఛగా కోడి పందేలు జరిగాయి. కోట్ల కొద్దీ 'కట్టలు' తెంచుకుంది. పోలీసులు కూడా ప్రేక్షకుల్లో కలిసి పోయారు. సాక్షాత్తు హోం మినిస్టర్ చిన రాజప్ప ఆదేశాలు నీరుగారిపోయాయి. పలువురు ప్రజాప్రతినిధులే సీఎంను కలిసి మరీ కోడి పందేలకు అనుమతులివ్వాలని కోరడం విశేషం. ఉభయగోదావరి, కృష్ణాజిల్లాలో కలిసి సుమారుగా రూ. 2వేల చేతులు మారినట్టు అంచనా. మధ్య ఏరులైపారింది. గుండాట, పేకాట, కోతాట విచ్చల విడిగా జరిగాయి. ప్రత్యర్థులు కోడి పందెం రూ.లక్షల్లో వేసుకుంటే చూడడానికి వచ్చిన వారు వేసుకున్న పందేలు అనేకం. ఒక్క పందెం ముగిస్తే దాదాపు రూ. పది నుంచి పదిహేను లక్షలు చేతులు మారాయి. తుర్పుగోదావరి జిల్లా మురముళ్లలో భోగిపండుగ రోజు రూ.పది కోట్ల వరకు పందేలు జరిగాయి. పదిహేను ఎకరాల్లో స్థానిక ఎమ్మెల్యే బహాటంగా సిద్ధం చేసిన బరికి వేలాదిగా జనం తరలి వచ్చారు. ఇక్కడ గుండాటదే ప్రముఖస్థానం నంబరు ఆధారంగా ఆడే జూదం గుండాట నిర్వహణకు ఇక్కడ ఆరు బోర్డులకు నిర్వాహకులకు రూ. 38 లక్షలు చెల్లించారు. రెండోరోజు రూ.ఇరవైకోట్లకు పైగానే చేతులు మారినట్లు సమాచారం. తెలంగాణ నుంచి సైతం కార్లలో ఇక్కడికి రావడం గమనార్హం. కార్లపార్కింగ్ కోసమే ఎనిమిది ఎకరాల స్థలం ఉంచారు. కనుమ రోజూ భారీగానే జరిగాయి. జిల్లాలో మురముళ్ల బరి అతి పెద్దదైతే చాలా ప్రాంతాల్లో రాజకీయ నాయకులే దగ్గరుండి కోడిపందేలు ఆడించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. కొల్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఐదుగురు సిబ్బంది ఉండగా ఒక్క హెడ్ కానిస్టేబుల్ మరో కానిస్టేబుల్ మాత్రమే స్టేషన్‌లో విధులు నిర్వహించడం ఉదాహరణ. చాలా స్టేషన్లలో ఇదే పరిస్థితి. తాము కోడిపందేల నిర్వహణను అడ్డుకోలేని పరిస్థితిలో ఉన్నామని పలువురు పోలీసు అధికారులు బాహాటంగానే వెల్లడించారు. రాజోలు, కొత్తపేట, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని చింతలపల్లి, మలికిపురం, లక్కవరం, గూడపల్లి, పొడగుట్టపల్లి లంక, రామేశ్వరం, లొల్లర్యాలి, పొడగుట్టపల్లి, దేవరపల్లి, నడిమిలంక, గద్దెనాపల్లి, చెయ్యారు. పల్లంకుర్రు శివారు ఐ చెరువు, అన్నం పల్లి, పల్లిపాలెం, గున్నేపల్లి అగ్రహారం గ్రామాల్లో కోడిపందేలు కోలాహలంగా సాగాయి. కాకినాడ



రూరల్ లో అచ్చంపేట, అచ్చుతాపురం, గంగనాపల్లి, సర్పవరం, తిమ్మాపురంతో పాటు 16 ప్రాంతాల్లో కోడి కాలు దువ్వి కత్తి కట్టింది. కాజులూరు, గొల్లపాలెం, కల్లిపాలెం, కుయ్యేరు, జగన్నాధగిరి, కె.గంగవరం, పీకేరు, ఎండగండి, కూళ్ల, రామచంద్రపురం, ద్రాక్షరామంలో కోడిపందేలు యథేచ్ఛగాసాగాయి. మొత్తంగా మూడురోజుల కోడిపందేలలో వందకోట్లకుపైగానే చేతులు మారాయని పందెంరాయుళ్లే వెల్లడిస్తున్న సమాచారం.

పశ్చిమగోదావరి జిల్లాల్లో కోడిపందేలు నిరాఘాటంగా సాగాయి. జిల్లాలో సుమారు 80 పెద్ద బరుల్లో ఈ పందేలు జరిగినట్టు తెలిసింది. వెంప, ఐ భీమవరం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ మొదలగు ప్రాంతాల్లో ఒక్కో పందెం రూ.30 లక్షల దాకా జరిగినట్టు అంచనా. ఉండి ప్రాంతాంలో మూడు లోల దాకా పందేలు, పై పందాలు సాగాయి. ఒక్కో పెద్ద బరి వద్ద కోటి రూపాయల మేర కోతాట, గుంటాట, పేకాట జరుగుతున్నాయి. అక్కడ మద్యం షాపుల లెక్కకు మించి ఉన్నాయి. మద్యంతో పాటు కొన్ని ప్రాంతాల్లో సారాకూడా ఏరులై ప్రవహించింది. ఇక మాంసం, బిర్యానీలు, చికెన్ పకోడీలు, ఇతర మాంసం వంటకాలు వ్యాపారాలు జోరుగా సాగాయి. టిప్ టాప్ పందిళ్లు వేసి, సిట్టింగులు పెట్టి నిర్వాహకులు జనానికి అన్ని రకాల వసతులు కల్పించి డబ్బు దోజుకుంటున్నారు. భీమవరం ఇండస్ట్రీయల& ఎస్టేట్ వెంప, లోసలి గూట్లపాడు, ఉండి మండలంలోని మహదేవపట్నం, చినపుల్లేరు, ఉండి, తణుకు సమీపంలోని తేతలి, దువ్వ, ఉండ్రాజవరం, జంగారెడ్డిగూడెం సమీపంలోని శ్రీనివాసపురం, ఆకివీడు, ఐ భీమవరం, ఇట్లా పెద్ద పెద్ద బరుల జనంతో కిటకిటలాడాయి. ద్వారకాలిరుమల మండలం రాట్నాలకుంట, జి కొత్తపల్లి, తిరుమలంపాలెం, నారాయణపురం ప్రాంతాల్లో పెద్ద బరుల వద్ద పందెంరాయుళ్లు లక్షల రూపాయల్లో పందేలు కాస్తున్నారు. ఇక నరసాపురం, మొగల్తూరు, తాడేపల్లిగూడెం, పెంటపాడు, కొయ్యలగూడెం, కామవరపుకోట చింతలపూడి, లింగపాలెం, పోలవరం, మొదలగు ప్రాంతాల్లో బరుల వద్ద ఇతర రాష్ట్రాల వారు పందేలు కాశారు. ఈ పందేలకు తెలంగాణ, కర్ణటక, తమిళనాడు ప్రాంతాల నుంచి పందెం రాయుళ్లు మూడు రోజుల క్రితమే చేరుకున్నారు. తణుకు దగ్గర వేల్పూరులో భోగినాడు కోడి పందేల నిర్వాహణ విషయంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి కోడి కాళ్లకు కత్తి వల్ల గాయమైంది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వేల్పేరులో పందేలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. కృష్ణాజిల్లాలోని గుడివాడ, కైకలూరు, గన్నవరం, పెనమలూరు, అవనిగడ్డ, మచిలీపట్నం, నూజివీడు, నందిగామ ప్రాంతాల్లో కోట్లాది రూపాయిల్లో కోడి పందేలు కొనసాగాయి. అధికార ప్రజాప్రతినిధులు స్వయంగా కోడి పుంజులకు కత్తులు కట్టి, కోర్టు తీర్పునకు విరుద్ధంగా పందేలను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర నుంచి కృష్ణాజిల్లాకు టీఆర్ఎస్, టీడీపీ నేతలు తరతలివచ్చి పందేలకు హాజరయ్యారు. కృష్ణాల్లో నూజివీడు, పెనమలూరు నియోజకవర్గాల పరిధిలో కోట్ల రూపాయిల్లోనూ, అవనిగడ్డ, కైకలూరు, కేంద్రాలుగా లక్షల్లోనూ పందాలు కొనసాగాయి. ఏకమొత్తంగా కృష్ణాజిల్లాలో కూడా సుమారుగా రూ.300 కోట్లు చేతులు మారినట్టు అంచనా. ఈ ప్రాంతలే కాకుండా పెనమలూరు, పెదపులిపాక, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల పరిహదులోని అప్పనవీడు, కేవీపీ స్వగ్రామమైన అంపాపురంచ దివిసీమలోని అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన వంటి ప్రాంతాల్లో యథేచ్ఛగా కోడి పందేలు జరిగాయి ఈ పందేలకు హాజరయ్యేందుకు వచ్చిన అతిథులతో విజయవాడ నగరంలోని పలు హోటళ్లు కిక్కిరిసిపోయాయి. రెండు నెలల ముందుగానే ఈ హోటళ్లను బుక్ చేసుకున్నట్టు తెలిసింది.


## రైతుల భూములు లాక్కోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

భవనాలకు రూ.650 కోట్లు వెచ్చింది. కమీషన్లు దండుకున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాజధాని ప్రాంతంలోనే ఇల్లు కొనుక్కుని ఉంటానని జగన్ పేర్కొన్నారు. ఏడాదిలో ఎన్నికలు వస్తాయని, లేని పక్షంలో రెండేళ్లలో వైకాపా అధికారంలోకి వచ్చి రైతులు మెచ్చిన రాజధాని నిర్మిస్తామని అన్నారు రైతులందరూ పత్రాలు జాగ్రత్తగా పెట్టుకోవాలని.. కోర్టులకు వెళ్లడం, ధర్నాల ద్వారా రెండేళ్లపాటు భూములు రక్షించుకుంటే వైకాపా అధికారంలోకి వచ్చాక వారి భూములు వారికే ఇస్తామని చెప్పారు.

**'జగన్.. గోబ్యాక్' అంటూ బ్యానర్లు**

జగన్ గోబ్యాక్ అంటూ నిడమర్రు మార్గంలో బేతపూడి క్రాస్‌రోడ్డు వద్ద రాజధాని ప్రాంతరైతుల పేరుతో బ్యానర్లు కట్టారు. కురగల్లులో కొందరు రాజధాని ప్రాంత రైతులు జగన్ గోబ్యాక్ అంటూ రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు వారిని అక్కడినుంచి పంపించారు. కురగల్లు నుంచి మందడం మీదుగా లింగాయపాలెం వెళ్లడానికి తాత్కాలిక సచివాలయం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతాయని జగన్ కాన్వాయ్‌లో ఆరు వాహనాలకు మాత్రమే అనుమతించారు. తాత్కాలిక సచివాలయం మీదుగా జగన్ లింగాయపాలెం చేరుకున్నారు.



## అమ్మవారిని దర్శించుకున్న సినీ దర్శకుడు సుకుమార్, నటి హేమ

**రాజధానిప్రతినిధి,కోనసీమ -జిఎన్.రావ్ :** తూర్పుగోదావరి జిల్లా కోనసీమ పరిధి రాజోలు శివకోడు గ్రామంలో వేంచేసియున్న శ్రీకుంతలేశ్వరి పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సినీ దర్శకుడు బండ్రెడ్డి సుకుమార్, సినీ నటి హేమలు శ్రీఅమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## అప్పనపల్లి బాలబాలాజీని దర్శించుకున్న దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల



**రాజధానిప్రతినిధి,కోనసీమ -జిఎన్.రావ్ :** ప్రముఖ సినీ దర్శకుడు అడ్డాల శ్రీకాంత్ అప్పనపల్లి శ్రీబాలబాలాజీ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు మద్దాల తిరుమల శింగరాచార్యులు, జోస్యుల సోమయాజులు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. స్వామివారి ఆధ్వర్యంలో శ్రీకాంత్‌కు వేద ఆశీర్చనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో తాను సీతమ్మవాకిట్లో సిరిమల్లెచెట్టు, బ్రహ్మోత్సవం, ముకుంద వంటి విభిన్న చిత్రాలను రూపొందించానన్నారు. ఏటా సంక్రాంతి పండుగకు ఈ ప్రాంతానికి రావడం తనకు అలవాటని, కనుమ రోజున జరిగే ప్రభల తీర్థం చూడడం తనకు చెప్పలేని ఆనందం కలుగచేస్తుందని అన్నారు. సంక్రాంతి పండుగ తరువాత కొత్త చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకురావడం తనకు సెంటిమెంట్‌గా వస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి సభ్యులు బోనం బాబు, అడ్డాల శ్రీకాంత్‌కు బాలబాలాజీ చిత్రపటాన్ని కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అడబాల తాతకాపు, తుల ఆదినారాయణ, బొలిశెట్టి శివ, ఆలయ తనిఖీదారు బిఎస్.మూర్తి తదితరులు ఉన్నారు.


## సంక్రాంతికి విడుదలైన చిత్రాలన్నీ బావున్నాయి

**సినీ దర్శకుడు సుకుమార్**



**రాజధానిప్రతినిధి,కోనసీమ -జిఎన్.రావ్ :** ప్రస్తుతం సంక్రాంతికి విడుదలైన అన్ని చిత్రాలు బావున్నాయని అవి విజయం సాధించడం తనకు ఆనందం కలిగించిందని ప్రముఖ సినీ దర్శకుడు బండ్రెడ్డి సుకుమార్ అన్నారు. ఆయన స్వస్థలం మట్టపర్రులో కుటుంబ సభ్యులతో సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరంజీవి నటించిన ఖైది నంబర్ 150 చాలా గ్యాప్ తరువాత చిరంజీవి నటించిన ఈ చిత్రం విజయం సాధించిందని, నిజంగా బాస్ ఈజ్ బ్యాక్ అని అన్నారు. తన సొంత బ్యానర్ బిటిఆర్ క్రియేషన్స్‌లో రూపొందిస్తున్న సినిమా త్వరలోనే విడుదల కానుందని అన్నారు. తన సోదరుని కుమారుడు అశోక్ హీరోగా, హీరోయిన్‌గా ఇషా నటిస్తున్నారన్నారు. ఈ చిత్రానికి తన మరో సోదరుడు బి.విజయ్‌కుమార్, థామస్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సాయికార్తీక్ సంగీతం అందించిన ఈ చిత్రం మార్చిలో విడుదల చేయనున్నట్లు తెలిపారు. తమ తదుపరి సినిమా వివరాలను త్వరలోనే వివరిస్తానని తెలిపారు.

## వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రాజధానిప్రతినిధి,కోనసీమ -జిఎన్.రావ్ :** అమలాపురం మహిపాలవీధిలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో భక్తులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించే లక్ష్యంతో కెయిర్న్ ఎనర్జీ సంస్థ సామాజిక అభివృద్ధి నిధులు రూ.10లక్షలు మంజూరు చేయగా, ఆయన పనులకు సంబంధించి హోంశాఖా మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. తొలుతుగా హోంమంత్రి రాజప్పకు దేవస్థానం చైర్మన్ కర్రి రామస్వామి(దత్తుడు), ఈవో విఎస్ఎన్.మూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు మౌళిక వసతులు కల్పించే లక్ష్యంతో ప్రహరీ నిర్మాణం, కోనేరు చుట్టూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి.గణేష్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు, వైస్ చైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరక్టర్ పెచ్చెట్ట చంద్రమౌళి, జడ్పిటిసి దేశంశెట్టి లక్ష్మీనారాయణ, దేవస్థానం పాలవర్గ సభ్యులు బసవా సింహాద్రి, రేపాక సత్యనారాయణమూర్తి, ఆచంట మూలాస్వామి, సంగినీడి గణేష్, కుంచే వెంకన్న, తిక్కిరెడ్డి సురేష్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్ తదిరతులు పాల్గొన్నారు.

## స్రవంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో రాత్రి పాఠశాల



**రాజధాని ప్రతినిధి, హనుమాన్‌జంక్షన్ :** ప్రభుత్వ విద్యను బలోపేతము చేసే దానిలో భాగంగా ఆయా పాఠశాలలో చదువుచున్న విద్యార్థులకు ముఖ్యంగా నిరుపేదల జీవించే హనుమాన్‌జంక్షన్ లోని మహాత్మాగాంధీనగర్‌లో ప్రతిరోజు సాయంత్రం 5 గంll ల నుండి 8 గంll ల వరకు " శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ " ఆధ్వర్యంలో ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రాత్రి పాఠశాలని నిరాటంకంగా నిర్వహిస్తూ పలువురి అభినందనలు అందుకుంటున్నారు. నవంబరు 2 వ తేదీన ప్రారంభించిన ఈ కేంద్రంలో 1 వ తరగతి నుండి 9 వ తరగతి వరకు వివిధ పాఠశాలల్లో చదువుచున్న 95 మంది విద్యార్థులు రాత్రి పాఠశాలకు వచ్చి తమ ప్రతిభను చూపిస్తున్నారు. కాన్వెంటులో చదివే విద్యార్థులు సహితం ఈ కేంద్రంలోనికి వస్తున్నారు. పాఠశాలను మరిపించే విధముగా ట్రస్టు వారు ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నిర్వహించటం విశేషం. విద్యార్థులకు ఈ రాత్రి పాఠశాలలో క్రమశిక్షణకు మారుపేరుగా 5 గంllలకే అటెండెన్సు వేస్తారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు బి.డి.ఎస్.రాజు, దయాల ప్రభాకరరావుల పర్యవేక్షణలో నిర్వహించే రాత్రి పాఠశాలకు సహాయకులుగా బోను శ్రీవిద్య, షేక్ నర్గీసు, ఉపాధ్యాయులుగా కొండపల్లి కరుణజ్యోతి, మూడెడ్ల దుర్గాభవాని, కనికరం ఆదిలక్ష్మీ కుమారి, మల్లంపల్లి జ్యోతి వ్యవహరిస్తున్నారు. ప్రతి నెల రాత్రి పాఠశాల నిర్వహించేందుకు రూ.16 వేల రూపాయలు వ్యయం అవుతుందని " శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ " ఛైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్ తెలిపారు. నిరుపేదలు జీవించే ప్రాంతంలో విద్యను ప్రోత్సహించేందుకు ఈ పాఠశాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే బాపుల పాడు గ్రామంలో మరో రెండు రాత్రి పాఠశాలలను నిర్వహించనున్నట్లు వీరమాచనేని తెలిపారు.

# ఉత్తరాదిపై చలిపంజా



**శ్రీనగర్ :** ఉత్తరాదిపై చలి తన పంజా విసుతోంది. దాదాపుగా అన్ని రాష్ట్రాల్లోనూ రాత్రిపూట అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. గడచిన ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా శ్రీనగర్ చల్లగా మారిపోయింది. దాల్‌లేఖ్‌కు నుంచి మంచినీరు వచ్చే అన్ని పైపులైన్లు దాదాపుగా గడ్డకట్టుకుపోయాయి. శ్రీనగర్‌లో మైనస్ ఐదు డిగ్రీల సెల్సియస్ నమోదైనట్టు వాతావరణశాఖాధికారులు తెలిపారు. లేహ్, పహెల్‌గామ్ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. జమ్మూ కాశ్మీరులోని లడఖ్ ప్రాంతంలో ఉన్న లేహ్ పట్టణం గడ్డకట్టుకు పోయింది. మైనస్ 14 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. దక్షిణ కాశ్మీరులోని పెహెల్‌గామ్ కొండ రిసార్ట్స్‌లో అత్యల్పంగా మైనస్ 13డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దక్షిణ కాశ్మీరులోని మరో ప్రముఖ ప్రాంతమైన గుల్‌మార్గ్‌లో మైనస్ 13.6 డిగ్రీలు, కొకెర్‌నాగ్‌లో మైనస్ 8.7, కుప్వారాలో మైనస్ 6.8 డిగ్రీలు, క్వాజిఘడ్‌లో మైనస్ 7 డిగ్రీలు నమోదైంది. విపరీతంగా మంచుకురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జనవరి 15 నుంచి 'చిల్లాయ్-కలన్' అనే సీజన్ మొదలవుతుంది. ఈ సీజన్ గత సంవత్సరం డిసెంబరు 21న మొదలై జనవరి 13 వరకూ సాగింది. ఆసీజన్ ముగిసిన తరువాత కూడా చలి ప్రభావం కొనసాగుతూనే ఉంది.

**పంజాబ్, హరియానా గజగజా...**

పంజాబ్, హరియానా రాష్ట్రాలు చలిగుప్పెట్లో గజగజలాడుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. రెండు రాష్ట్రాల్లోనూ కలిపి నార్నవుల్ ప్రాంతంలో మైనస్ సున్నా డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. పంజాబ్, హరియానాలోని పలు ప్రాంతాల్లో చలిగాలులు వీస్తున్నాయనీ, ఉదయం ఎండ కూడా ఉక్కువగా ఉంటోందని అధికారులు చెబుతున్నారు. పంజాబ్‌లోని అమృతసర్‌లో 1డిగ్రీల సెల్సియస్, లుథియానాలో 2.3, పాటియాలలో 3.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. రెండు రాష్ట్రాలకు రాజధాని అయిన చండీగర్‌లో 3.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

**వణుకుతున్న రాజస్థాన్,శిఖర్...**

రాజస్థాన్‌లో చలి గుప్పెట్లో చిక్కుకుంది. శిఖర్‌లో అతి తక్కువ ఉష్ణోగత 1డిగ్రీ సెల్సియస్ నమోదైంది. శిఖర్ తరువాత చేరులో 0.1 డిగ్రీల సెల్సియస్ నమైదనట్టు వాతావరణశాఖ



అధికారులు తెలిపారు. మౌంట్ అబులోమైనస్ 0.5, భిల్వారా, శ్రీగంగానగర్, ఆల్వార్, పిలానీ, వనస్థలి, డబోక్‌లలో వరుసగా 0,0.2,1.5,1.9,2.1,2.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**ఐజ్వాల్‌లో రికార్డు స్థాయి చలి**

ఐజ్వాల్‌లో చలి రికార్డు సృష్టించింది. 3.2 డిగ్రీలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 23.2 డిగ్రీల సెల్సియస్,కనిష్ఠ ఉష్ణోగ్రత 3.2 డిగ్రీలుగా నమోదైనట్టు వాతావరణ శాస్త్రవేత్త కె లాల్‌రామ్ తెలిపారు.

**యూపీ, లక్నోలో చలి - పులి**

ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలు చలితో వణుకుతున్నాయి. లక్నోలో 0.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గోరఖ్‌పూర్ డివిజన్‌లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గోరఖ్‌పూర్, ఫైజాబాద్, కాన్పూర్, వారణాసి,అలహాబాద్, లక్నో, బైరేలీ, మెరాబాద్, ఆగ్రా, మీరట్‌లలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

### మన్యంలో మరింత క్షీణించిన ఉష్ణోగ్రతలు



**చింతపల్లి :** విశాఖ మన్యంలో చలిపులి విజృంభిస్తోంది. నాడు ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగిలో 2 డిగ్రీలు, చింతపల్లిలో 5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం సాంకేతిక అధికారి ప్రవీణ్ తెలిసారు. సంక్రాంతి తరువాత సాధారణంగా ఉష్ణోగ్రతలు పెరిగుతాయి. గతానికి భిన్నంగా ఈ ఏడాది తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



## ఏపీ ఏడీసీ ఛైర్‌పర్సన్‌తో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల భేటి

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** రాజధాని అమరావతిలో ఆంధ్రప్రదేశ్ అమరావతి అభివృద్ధి సంస్థ (ఏపీ ఏడీసీ) చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రపంచ బ్యాంకు రుణం ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో భాగంగా బ్యాంకు ప్రతినిధులు బుధవారం ఏపీ ఏడీసీ ఛైర్మను / మేనేజింగ్ డైరెక్టరు డి. లక్ష్మీ సార్థసారధితో కేదారేశ్వరపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో భేటీ అయ్యారు. ముందుగా ఛైర్‌పర్సను అమరావతి అభివృద్ధి సంస్థ రాజధాని నిర్మాణంలో ప్రధాన భూమికను పోషిస్తోందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు. అమరావతి నగర నిర్మాణంలో ఏడీసీ చేపడుతున్న వివిధ మౌలిక సదుపాయాల గురించి తెలియజేశారు. రాజధానిలో చేపడుతున్న ప్రధాన అనుసంధాన రహదారి (సీడ్ యాక్సెస్ రోడ్డు ), త్వరలో నిర్మాణం చేపట్టనున్న ఏడు రహదార్ల నిర్మాణాలపై వారితో చర్చించారు. అమరావతిలోని అన్ని ప్రాంతాలను ఈ రహదార్లు అనుసంధానం చేస్తాయని దృశ్యశ్రవణం ద్వారా వివరించారు. కొండవీటివాగు, పాలవాగుకు సంబంధించి వరద ముంపు నియంత్రణా ప్రణాళికలను ఏడీసీ అధికారులు ప్రపంచ బ్యాంకు బృందానికి వివరించారు. ఈ



సమావేశంలో ప్రపంచ బ్యాంకు ప్రధాన ప్రతినిధి రఘుకేశవన్, ఇతర ప్రతినిధులతో పాటు, ఏపీ ఏడీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మదర్సాల్లోనూ మధ్యాహ్న భోజనం

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్ సహా ఐదు రాష్ట్రాలు ఎన్నికలకు సిద్ధమౌతున్న నేపథ్యంలో మదర్సాల్లోనూ మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని రాష్ట్ర మైనారిటీల కమిషన్ల వార్షిక సదస్సులో పాల్గొన్న కేంద్రమంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీ తెలిపారు. దీనిపై సలహాలు, సూచనలు అందజేయాలని కోరామన్నారు. 2016, డిసెంబరు 29న మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (ఎంఈఏఎఫ్) జనరల్ బాడీ సమావేశంలో మదర్సాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్న నిర్ణయం జరిగిందని నఖ్వీ తెలిపారు. విజ్ఞాన, గణిత శాస్త్రాలు భోధించే మదర్సాలకు సాయం చేయాలని, మధ్యాహ్నం భోజన్నాని అందించాలని దాదాపు వారం రోజుల క్రితమే కేంద్రం నిర్ణయించిందన్నారు. మదర్సాలు భారత్‌లో భాగం కాదనడం సబబు కాదని, చాలా మదర్సాలు పిల్లలకు విద్యాబుద్ధులు మైనారిటీల జాతీయ కమిషన్ చైర్మన్ నసీం అహ్మద్, కార్యదర్శి అమరేంద్ర సిన్హా, సభ్యులు ప్రవీణ్ దావర్ తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని రైతుల ప్లాట్లపై ఖాళీస్థలాలకు పన్ను మినహాయింపు



- సీఆర్డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ హామీ
- రక్త సంబంధీకులకు బదలాయింపు ఛార్జీల మినహాయింపు

**రాజధాని,ప్రతినిధి - విజయవాడ :** రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు సీఆర్‌డీఏ మరింత భరోసా ఇచ్చింది. వారికి కేటాయించిన ప్లాట్లకు ఖాళీస్థలాల పన్ను మినహాయింపునకు చర్యలు తీసుకుంటామని ఏపీసీఆర్‌డీఏ కమీషనర్ చెరుకూరి శ్రీధర్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా ల్యాండ్ పూలింగ్ యజమాని సర్టిఫికేట్‌ను రక్త సంబంధీకుల బదాలయింపునకు ఎలాంటి రుసుము ఉండబోదన్నారు. విజయవాడలో సీఆర్‌డీఏ కమిషనర్‌ను అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య ప్రతినిధులు గురువారం కలిశారు. అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, గౌరవాధ్యక్షులు డాక్టర్ మాదల శ్రీనివాస్, తల్లం పానకాల రెడ్డి, లంకా సుధాకర్, చెన్న కేశవరావు, మాదల రాజేంద్ర, ముప్పవరపు వెంకటరావు, పాలెపు రామారావు, మాదల సురేంద్రబాబు కమీషనర్‌ను కలిసి, రైతుల విన్నపాలను విన్నవించారు. అనుబంధ దస్తావేజు (సప్లిమెంటరీ డీడ్ ఫారమ్ నెంబరు 9.14) పై ఉన్న వివిధ అనుమానాలను కమీషనర్ దృష్టికి సమాఖ్య ప్రతినిధులు తీసుకెళ్ళారు. ప్రస్తుత రోడ్ల విస్తరణలో నివాసాలు కోల్పోయిన వారికి భూమికి భూమి, భవనాలకు రెట్టింపు విలువ, ట్రాన్సర్ ఖర్చుల కింద రూ.2 లక్షలు చెల్లించాలని కోరారు.

పెనుమాక గ్రామంలో కొండ ప్రాంతం నుంచి రైల్వే ట్రాక్ వస్తోందని, 4 ఎకరాలు మైనింగ్ లీజ్‌కి ఇచ్చారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని శ్రీధర్ స్పష్టం చేశారు. ఎన్టీఆర్ శిఖరం ఫౌండేషన్‌కు నీరుకొండ పై స్థలం కేటాయించాలని గౌరవాధ్యక్షుడు డాక్టర్ మాదల శ్రీనివాస్ కోరారు.

## ఎస్‌కెబిఆర్ విద్యార్థుల అవగాహన కార్యక్రమం

**రాజధానిప్రతినిధి,కోనసీమ -జిఎన్.రావ్ :** దోమలపై దండయాత్ర చేద్దాం, రోగాలను తరిమేద్దాం అంటూ ఎస్‌కెబిర్ కళాశాల విద్యార్థులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2, ఎన్ఎస్ఎస్ యూనిట్3,4 విభాగాల ఆధ్వర్యంలో ఇందుపల్లి, పేరూరు, ఈదరపల్లి గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా మురుగు ప్రాంతాలను శుభ్రపరిచారు. తరువాత దోమలపై దండయాత్ర నినాదంతో ప్రభుత్వం ప్రచురించిన కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బొంతు విజయకుమారి, నక్కా సంపత్‌కుమార్, పెచ్చెట్టి చంద్రమౌళి, ఉపసర్పంచ్ బొంతు గోవిందుశెట్టి, పంచాయితీ కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్.సూరపరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, డాక్టర్ కె.సత్యనారాయణ, విఎస్‌విఎన్.నారాయణమూర్తి, టి.సుందరరామయ్య పాల్గొన్నారు,

## ఈ నెల 29న జానపద కళోత్సవాలు

**రాజధానిప్రతినిధి,కోనసీమ -జిఎన్.రావ్ :** శ్రీఅభ్యుదల కళానికేతన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదిన జాతీయ జానపద కళోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీంఖాన్ తెలిపారు. బండారులంక జిల్లాపరిషత్ ఉనత్న పాఠశాల ప్రాంగణంలో జరిగే ఈ కళోత్సవాల్లో లలిత సంగీతం, జానపద గీతాలు, కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య పోటీలు నిర్వహిస్తామన్నారు. వివిధ రంగాల్లో ప్రముఖులైన ఐదుగురిని అభ్యుదయశ్రీ-2017 అవార్డుతో సత్కరించడం జరుగుతుందన్నారు. జానపద కళోత్సవాల్లో పాల్గొనదలచినవారు వివరాల కోసం కోశాధికారి పఠాన్ షహీద్ ఉన్నీషాబేగం, సెల్ : 9014661073ను సంప్రదించాలని కోరారు.

## మార్చి 6న బడ్జెట్ !



**రాజధాని ప్రతినిధి ,(అమరావతి) :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను కేవలం 18 పనిదినాల్లో ముగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్చి 1న గవర్నర్ ఉభయసభలనుద్దేశించి చేసే ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 6వ తేదీన వార్షిక (2017-18) బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అసెంబ్లీకి సమర్పించనున్నారు. మార్చి 27వ తేదీతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ముగించాలని నిర్ణయించారు. అంటే సెలవు రోజులు పోను బడ్జెట్ సమావేశాలు 18 రోజులు జరగనున్నాయి. బడ్జెట్ సమావేశాల తేదీల ఫైలుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రదాన కార్యదర్శి టక్కర్ ఆమెదం తెలిపి ఆ ఫైలును ఆర్థిక మంత్రి ఆమోదానికి పంపించారు. ఆర్థిక మంత్రి ఆమోదం అనంతరం ముఖ్యమంత్రి, గవర్నర్‌ల ఆమోదానికి ఫైలు వెళ్లాల్సి ఉంది. ఒకపక్క తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీ శీతాకాల సమావేశాలను ఎక్కురోజులు నిర్వహించడం ఆ రాష్ట్ర సమస్యలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయని, అందుకు విరుద్ధంగా బాబు సర్కారు ఏకంగా శీతాకాల సమావేశాలనే నిర్వహించకపోగా బడ్జెట్ సమావేశాలను కూడా తక్కువ రోజుల్లో ముగించాలని చూడటం విడ్డూరంగా ఉందని రాజకీయ వర్గాలు విమర్శిస్తున్నాయి.

**హైదరాబాద్‌లో యనమల సమీక్ష**

ఆర్థిక మంత్రి యనమల బడ్జెట్ అంశాలపై చర్చించేందుకు ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో తన శాఖ ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ), ఎస్టిమేట్స్ కమిటీ సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వమించరాదని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో యనమల మాత్రం సమీక్షను ఇక్కడ నిర్వహించడం పట్ల అధికార వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఇలా ఉండగా బడ్జెట్‌కు సంబంధించి వివిధ శాఖలు పంపిన ప్రతిపాదనలపై సమీక్షలను ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజేయ కల్లం శుక్రవారంతో పూర్తి చేశారు. అయితే 23,24.25 తేదీల్లో మంత్రులతో యనమల బడ్జెట్ సమీక్షలు నిర్వహించాల్సి ఉండగా దానిని వాయిదా వేసుకున్నారు.

## స్వేచ్ఛను హరిస్తున్నారు

**మన్మోహన్ సింగ్**

**కోల్‌కత్తా :** దేశంలోని విశ్వవిద్యాలయాల్లో భావప్రకటన స్వేచ్ఛ, స్వతంత్ర ఆలోచన ప్రమాదంలో పడ్డాయని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అన్నారు. కోల్‌కత్తాలోని ప్రెసిడెన్సీ విశ్వవిద్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గతేడాది హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఢిల్లీ జేఎన్‌యూలలో తలెత్తిన వివాదాలను చూస్తే విద్యార్థుల స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయన్నారు. విద్యార్థుల శాంతియుత నిరసన ప్రదర్శనలను అణిచివేయడం అప్రజాస్వామికన్నారు. ప్రతి విశ్వవిద్యాలయం సామాజిక వికాస కేంద్రంగా పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. వర్సిటీల్లో విజ్ఞానంతో పాటు స్వేచ్ఛను కల్పించాలన్నారు. కానీ భావప్రకటన స్వేచ్ఛ, స్వతంత్ర ఆలోచనా విధానం ప్రమాదకరంలో పడటం, అకడమిక్ ఉద్యోగాల బర్తీలో రాజకీయ జోక్యం పెరగడం అవాంఛనీయమని సింగ్ పేర్కొన్నారు. శాంతియుత నిరసనలను అణిచివేసే ప్రయత్నాలు విద్యావ్యవస్థపై వ్యతిరేక ప్రభావం చూపడమే కాదు.. ఆ చర్య అప్రజాస్వామికం అని అన్నారు. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రతి విశ్వవిద్యాలయం స్వయంప్రతిపత్తిని కాపాడుకొనే విధంగా అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు.

## అమరావతిలో వచ్చే సమావేశాలు : మంత్రి నారాయణ



**అమరావతి :** వచ్చే లసెంబ్లీ సమావేశాలు అమరావతిలోనే జరుగుతాయని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. వెలగపూడిలోని సచివాలయంలో పనుల్ని మంత్రి పరిశీలించారు. సచివాలయ తాత్కాలిక భవనాలను భవిష్కత్తులో వాణిజ్య అవసరాలకు వినియోగిస్తామని చెప్పారు. రాజధానిలో అంతా తాత్కాలిక నిర్మాణాలని ప్రతిపక్ష నేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విమర్శిలు చేయడం తగదన్నారు. ఈనెల 28 కల్లా అసెంబ్లీ భవనాల పనులు పూర్తి చేసి, 29న నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి అప్పగిస్తుందన్నారు.

“భారత దేశ ప్రజలమైన మేము భారత దేశాన్ని “ సర్వ సత్తాక, సౌమ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణంతంత్ర రాజ్యంగా” నిర్మించుకోవడానికి పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఆలోచన,భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనలతో స్వాతంత్ర్యాన్ని అంతస్తుల్లోనూ అవకాశాల్లోనూ సమానత్వాన్ని చేకూర్చి వ్యక్తి గౌరవాన్ని,జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి మన రాజ్యంగ పరిషత్తులో ఎంపిక చేసుకుని, చట్టంగా రూపొందించకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేమే ఇచ్చుకున్నాం.”-
ఇది మన రాజ్యాంగ ప్రవేశిక.





# జయహో భారత్

## ప్రాథమిక విధులు

42వ భారత రాజ్యాంగ సవరణ ద్వారా 1976 లో 10 ప్రాథమిక విధులను చేర్చారు. ఇవి భారత రాజ్యాంగంలోని నాల్గవ భాగంలో ఉన్నాయి.

- ప్రతి పౌరుడు రాజ్యాంగాన్ని జాతీయ పతాకాన్ని గౌరవించాలి.
- మన జాతీయ ఉద్యమాన్ని ఉత్తేజ పరిచే ఉదాత్త ,ఉత్తమ ఆశయాలను కాపాడాలి.
- భారత దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని పరిరక్షించాలి.
- దేశ రక్షణకు కంకణం కట్టుకోవాలి. అవసరమైతే జాతీయ సేవలో పనిచేయాలి.
- భారత పౌరుల మధ్య సౌభ్రాతృత్వ భావాలను పెంపొందించాలి.
- భారత జాతి ఉమ్మడి సంస్కృతిని పరిరక్షించాలి.
- మహిళల గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించే చర్యలను నిరసించి నిరోధించాలి.
- సహజ వాతావరణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, వాటిని సంరక్షించాలి. భూత దయ చూపించాలి.
- శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధికి తోడ్పడాలి. వ్యక్తిగత సామాజిక వికాసానికి కృషి చేయాలి.
- ప్రభుత్వ, ప్రవేటు ఆస్తులను కాపాడాలి. దౌర్జన్యాన్ని విడనాడాలి.

మనకి మనం రూపొందించుకున్న రాజ్యాంగం అమలులోకి వచ్చి నేటి ఆరు దశాబ్దాలుగా పైగా గడిచిపోయింది. ప్రజల ఆశలను, ఆశయాలను, అవసరాలను ప్రతిబింబించే విధంగా, విభిన్న జాతుల సంస్కృతికి, సంస్కారానికి అద్దం పట్టేలా సమాజ జీవన ప్రణాళికగా రాజ్యాంగాన్ని రూపొందించారు.రాజ్యాంగ నిర్మాతలు, అనేక దేశాల రాజ్యాంగాలను,విధానాలను పరిశీలించి దేశ పరిస్థితులను, భావి తరాలలో ఎదురవ్వబోయే పరిణామాలను సమాలోచించి ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేసుకోవడానికి అనుకూలమైన విధానాలతో రాజ్యాంగాన్ని రూపొందించారు. రాజ్యంగ రూపకల్పనకు 1947 ఆగష్టు 29న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధ్యక్షతన డ్రాస్టింగ్ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ దాదాపు రెండు సంవత్సరాల పదకొండు నెలల పద్దెనిమిది రోజుల ఆవిరళ కృషి జరిపిన తరువాత రాజ్యాంగం రూపుదిద్దుకుంది. ఈ క్రమంలో 1950 జనవరి 24 వ తేదిన దాదాపు 308 మంది అసెంబ్లీ సభ్యులతో ఆమోదం పొందింది.ఆ తరువాత రెండు రోజులకు అంటే 1950 జనవరి 26 గురువారం ఉదయం పదిగంటల పద్దెనిమిది నిముషాల సమయంలో భారత రాజ్యాంగం అమలులోకి

## ఘనంగా 68వ గణతంత్ర దినోత్సవం

వచ్చింది. అప్పుడే భారత దేశం “సర్వసత్తాక గణతంత్ర” రాజ్యంగా అవతరించింది. బ్రిటీషు కాలం నాటి 1935 చట్టం నుంచి అనేక భాగాలు ఈ రాజ్యంగంలో ప్రవేశించాయి.వీటితో పాటు అమెరికా రాజ్యాంగం నుండి ప్రాథమిక హక్కులు, ఇంగ్లాండు రాజ్యాంగం నుండి సమాఖ్య విధానాన్ని, జర్మనీ నుంచి అత్యవసర పరిస్థితుల నిబంధలను, ఐర్లాండ్ నుండి ఆదేశిక సూత్రాలు, అధ్యక్ష ఎన్నిక విధానాలను దక్షిణాఫ్రికా నుండి రాజ్యాంగ సవరణ పద్దతులను స్వీకరించి మన రాజ్యాంగంలో ప్రవేశపెట్టారు. తొలుత 395 ప్రకరణలు, ఎనిమిది షెడ్యూళ్ళతో రూపొందిన మన రాజ్యాంగం కాలానుగుణమైన మూర్పుల నేపథ్యంలో 42 వ రాజ్యంగ సవరణ ద్వారా “లౌకిక (సెక్యులరిజం)”, “ సామ్యవాద (సోషలిస్టు)” అనే పదాలు ప్రవేశికలో చేర్చబడి నేటికి 444 ప్రకరణలు, పన్నెండు షెడ్యూళ్ళతో అతి పెద్ద రాజ్యాంగంగా అవతరించి ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలకే ఆదర్శంగా నిలిచింది.

## ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగం మూడో భాగం 12 నుండి 35 నిబంధనలు భారత పౌరుల ప్రాథమిక హక్కులను గురించి తెలుపుతుంది. భారత రాజ్యాంగం భారత పౌరులకు ఏడు ప్రాథమిక హక్కులను ఇచ్చింది. అయితే 1978 లో జరిగిన 44 వ రాజ్యాంగ సవరణ ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల నుంచి తొలగించింది. ఇది పోను ప్రస్తుతం ఆరు ప్రాథమిక హక్కులు మాత్రమే ఉన్నాయి.

- సమానత్వపు హక్కు(140-18 నిబంధనలు)
- స్వాతంత్ర్యపు హక్కు (19-22 నిబంధనలు)
- దోపిడీని నిరోధించే హక్కు(23-24 నిబంధనలు)
- మత స్వాతంత్ర్యపు హక్కు (25-28 నిబంధనలు)
- సాంస్కృతిక విద్యా సంబంధమైన హక్కులు (29-30 నిబంధలను)
- రాజ్యాంగ పరిహార హక్కు (32 నిబంధన)

ప్రాథమిక హక్కులకు భంగం కలిగినపుడు భారత పౌరులు న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు.

భారత రాజ్యాంగంలోని 4 వ భాగంలోని 38 నుండి 51 గల నిబంధనలు ఆదేశ సూత్రాలను వివరిస్తాయి. ఆదేశ సూత్రాలు ఐరిష్ రాజ్యాంగం నుంచి గ్రహించబడినాయి.భారత పౌరుల పట్ల ప్రభుత్వం నిర్వహించాల్సిన బాధ్యతలను ఆదేశ సూత్రాలు వివరిస్తాయి. భారత దేశ రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాలను ప్రధానంగా మూడు వర్గాలుగా విభజించవచ్చు.

- శ్రేయోరాజ్య నిర్మాణానికి తోడ్పడే నియమాలు
- గాంధేయ సిద్దాంతానికి అనుగుణమైన నియమాలు
- అంతర్జాతీయ స్నేహ సంబంధాలకు అవసరమైన నియమాలు

**ఆదేశ సూత్రాలలో కొన్ని ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి**

- ప్రజా సంక్షేమ సాధనకు అవసరమైన సాంఘీక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని చేకూర్చే సమాజాన్ని స్థాపించడం.
- ప్రత్యేకంగా ఈ క్రిందివాటి కోసం కృషి చేయడం
  - ఎ. పౌరుల జీవనోపాధికి తగిన సౌకర్యాల కల్పన
  - బి. సమిష్టి సౌభాగ్యం కోసం దేశ సంపద సక్రమ పంపిణీ
  - సి. స్త్రీ, పురుషులకు సమాన వేతనాలు
  - డి. కార్మికుల ఆరోగ్య రక్షణ
  - ఇ. బాల్య.యువన దశలలో పిల్లలు నైతిక, భౌతిక, దుర్వ్యసనాలకు లోనుకాకుండా కాపాడటం.
- స్వపరిపాలనా సంస్థలుగా గ్రామ పంచాయతీలను స్థాపించడం
- నిరుద్యోగులకు, వృద్ధులకు, అనారోగ్యానికి గురైన వారికి తగిన

## ఆదేశ సూత్రాలు

సహాయం చేయడం


- పనిలో న్యాయమైన మానవతా పరిస్థితులును, ప్రసూతి సౌకర్యాలను కల్పించడం
- కార్మికులకు తగిన వేతనాలను, ప్రామాణిక జీవనం, విశ్రాంతి, వైజ్ఞానిక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం కల్పించడం.
- కుటీర పరిశ్రమలను స్థాపించడం.
- పౌరులందరికీ ఒకే ఉమ్మడి సివిల్ కోడ్‌ను రూపొందించడం
- రాజ్యాంగం అమలులోకి వచ్చిన 10 సంవత్సరాల నుండి 14 సంవత్సరాలలోపు పిల్లలందరికి ఉచితంగా ప్రాథమిక విద్యను బోధించడం.
- వెనుకబడిన వర్గాలకు, షెడ్యూల్డు కులాలకు, తరగతులకు విద్య, ఆర్థిక వ్యవహారాలలో అవకాశాలను పెంపొందించడం. వారు సాంఘీక అన్యాయానికి గురికాకుండా కాపాడటం.
- మద్యపానము, ఆరోగ్యానికి హాని కల్గించే మత్తు పదార్థాలను నిషేదించడం
- ఆధునిక శాస్త్ర పద్దతులలో వ్యవసాయం, పశుపోషణలను పెంపొందించడం, ప్రత్యేకంగా ఆవులను, దదూడలను వాటి జాతులను కాపాడి వృద్ధి చేయడం, గోవధ నిషేదించడం
- చారిత్రక ప్రాధాన్యత గల, జాతీయ ప్రాముఖ్యత గల ప్రాచీన



కట్టడాలను కాపాడటం

- కార్య నిర్వాహక శాఖ నుండి న్యాయ శాఖను వేరు చేయడం
- అంతర్జాతీయ రంగంలో శాంతి భద్రతలను పరస్పర గౌరవ సంబంధాలను పెంపొదించడం. అంతర్జాతీయ న్యాయ ఒప్పందాల పట్ల గౌరవాన్ని పెంపొందించడం, అంతర్జాతీచ వ్యవహారాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడానికి ప్రొత్సహించడం.

42 వ రాజ్యాంగ సవరణ ద్వారా వారు కొత్త ఆదేశా సూత్రాలను రాజ్యాంగంలో చేర్చారు




- ఉచిత న్యాయ సహాయాన్ని కల్పించడం
- పరిశ్రమల నిర్వహణలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించడం
- నిర్మలమైన వాతావరణాన్ని వన్యమృగ సంపదను పరిరక్షించడం
- స్వేచ్ఛగా , హుందాగా బాలలు వికాసాన్ని పొందడానికి అవకాశాలను కల్పించడం.

44 వ రాజ్యాంగ సవరణ ద్వారా మరో కొత్త ఆదేశ సూత్రాన్ని కూడా చేర్చారు.

- భిన్న ప్రాంతాలలోని వ్యక్తుల మధ్య సమూహాల మధ్య అంతస్తు అవకాశాలు, సదుపాయాలలో అసమానతలను తొలగించడానికి, ఆదాయాలలో అసమానతలు వీలైనంత తగ్గించడానిఇక కృషి చేయడం

# గణతంత్ర దినోత్సవ అతిథిగా ఆబుదాబి యువరాజు షేక్ మొహమ్మద్

గణతంత్ర దినోత్సవానికి ప్రతిఏడాది అతిధులను ఆహ్వానించడం భారతదేశ సంప్రదాయం. వీదేశీ ప్రభుత్వాధినేతలను మాత్రమే ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తారు. సాధారణంగా మన ఇరుగుపొరుగు దేశాల, లేదా సైనికంగా అవసరమనుకొన్న పాశ్చాత్య దేశాల అధినేతలకు మన దేశం ఆహ్వానం పంపుతుంది. మన ఆర్థిక వ్యవస్తను పరోక్షంగా కీలక తోడ్పాటునందిస్తున్న మధ్యప్రాచ్య దేశాల వైపు మన దేశం ఒక దశాబ్ధం క్రితం తన దృష్టిని మళ్ళించింది. 2003 లో ఐరాన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఖతామీని గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆ తరువాత 2006 లో సౌదీ అరేబియా రాజు అబ్దుల్లాకు ఈ గౌరవ అతిథ్యం లభించింది.

ఒక్క గల్ఫ్‌లోనే కాకుండా మొత్తం మధ్యప్రాచ్య దేశాలలో సైనికంగా, రాజకీయంగా, ఆర్థికంగా శక్తిమంతుడైన సౌదీ రాజును ఆహ్వానించిన తర్వాత మన దేశానికి అనేక ప్రయోజనాలు సిద్ధించాయనడంలో సందేహం లేదు. దీనికి కొనసాగింపుగా, ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత గల్ఫ్ దేశాలతో ఉన్న సంబంధాలను మరింత ఉన్నత దశకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఆయన గల్ఫ్‌లో శక్తిమంతమైన రాజకుటుంబాలైన ఆబుదాబిలోని అల్‌నహ్యాన్, సౌదీలోని అల్‌సౌద్‌లతో వీఅయునంతగా సన్నిహజతం కావడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రపంచ చమురు ఎగుమతులలో అతి పెద్ద వాటా ఈ రెండు కుటుంబాలదే కావడం గమనార్హం. మన ఆర్థిక వ్యవస్థలో ఈ రెండు గల్ఫ్ రాజ కుటుంబీకుల పాత్ర పరోక్షమైనదే అయినప్పటికీ చాలా బలీయమైనది.ప్రధాని మోడీ వ్యూహాత్మకంగా ఆబుదాభి యువరాజు శేఖ్ మోహమ్మద్ బిన్ జాయద్ అల్ నహ్యాన్ ను ఈ ఏడాది భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య



అతిథిగా ఆహ్వానించాలని నిర్ణయించారు. సాధారణంగా ఇప్పటి వరకు దేశాధినేతలను మాత్రమే ఆహ్వానించిన భారత ప్రభుత్వం షేక్ మోహ్మమద్ విషయానికి వచ్చే సరికి ఆ మర్యాదలను ప్రక్కన పెట్టింది. దేశాధినేత కాకపోయినా ఆయన్ను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించింది.

ఏడు ఏమిరేట్ల సమాఖ్య ఐన యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్(యుఏఇ) కి దేశాధినేతగా అబుధాబి ఎమిరేట్ పాలకుడే రాజుగా ఉంటారు. ఏడు ఎమిరేట్లలో కూడా భౌగోళికంగా, సైనికంగా, అరబ్బు తెగలపరంగానే కాకుండా చమురు ఉత్పత్తి ఆదాయంలోనూ అగ్రగామిగా ఉన్న ఆబుదాబి చెప్పిందే యు.ఏ.ఇలో వేదం.శేఖ్ మోహమ్మద్ అన్న శేఖ్ ఖలీపా ఆబుధాబి రాజు, యుఏఇ దేశాధినేత.ప్రవక్త మహమ్మద్ కాలం నుంచి నేటి వరకు అరబ్బు దేశాలలో ఎడారి తెగలది నిర్ణయాత్మక పాత్ర.

వెనుకబడిన ఎడారి రాజ్యాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళడంతో పాటు చుట్టుప్రక్కల ఉన్న అరబ్బు తెగలన్నింటితోనూ సత్సంబంధాలను కొనసాగించిన దివంగత శేఖ్ జాయద్ కొడుకుగా మొహమ్మద్ కూడ తన మాట, తీరు తెన్నులలో పూర్తిగా అరబ్బు సంస్కృతిని ప్రతిబింబిస్తారు. ఈ ఆధునిక కాలంలోనూ ఎడారి గుడారాలలో నివసించడానికి ఇష్టపడే మోహమ్మద్ వేలాది కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టే ఆర్థిక వ్యవహారాల మండలికి అధినేతగా ఉన్నారు. తన అన్న శేఖ్ ఖలీపా తర్వాత సింహాసనాన్ని అధిష్టించే మోహమ్మద్‌ను అరబ్బు తెగలు విశేషంగా అభిమానిస్తాయి. అమెరికా మొదలైన అగ్రరాజ్యాల ప్రభుత్వాధినేతలనూ పెద్దగా పట్టించుకోని శేఖ్ మోహమ్మద్‌ను ఆకర్షించడంలో ప్రధాని నరేంద్ర మోదీ సఫలీకృతులయ్యారు. భారతదేశంలో ఆబుధాబి పెట్టుబడులకు మన్మోహన్‌సింగ్ సర్కారు కాలంలోనే సూత్ర ప్రాయంగా నిర్ణయం తీసుకున్నప్పటికీ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిర్ణయం అమలును వేగవంతం చేశారు. భారతదేశంలో 75 బిలియన్ డాలర్లు మదుపు చేయడానికి శేఖ్ మోహమ్మద్ సంసిద్దత తెలిపారు. ఆగ్నేయాసియా దేశాలను దృష్టిలో పెట్టుకొని భారతదేశపు తూర్పు తీరంలో భారీ చమురు నిల్వ కేంద్రాన్ని నిర్మించాలని మన్మోహన్ సింగ్ హయాంలోనే ఆబుధాబి కోరింది. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇందుకు ఆమోదం తెలిపారు. ఈ భారీ చమురు నిల్వ కేంద్రాన్ని విశాఖ తీరంలో నిర్మించనున్నారు.

ఆబుధాబిలోని భారతీయుల చిరకాల వాంఛ అయిన హిందూ దేవాలయ నిర్మాణానికి యువరాజు మోహమ్మద్ ఆమోదం తెలిపారు. అంతే కాకుండా ఆ ఆలయ నిర్మాణానికి అవసరమైన 20 వేల చదరపు మీటర్ల స్థలాన్ని కూడా ఉచితంగా ఇవ్వడం జరిగింది. భారీ చమురు నిల్వ కేంద్రం అంశం జాతీయ అభివృద్ధికి తోడ్పడే అంశం కాగా ఆలయ నిర్మాణం రాజకీయ ప్రచారానికిగాను మోదీకి బాగా కలిసి వస్తుంది. ఈ అంశాలన్నీ పరిగణనలోకి తీసుకున్న మోడీ సర్కారు ఈ ఏడాది గణతంత్ర దినోత్సవాలను శేఖ్ మోహమ్మద్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించింది. **-బోస్**

# చిరంజీవి అంటే నాకు ప్రత్యేక అభిమానం

**రాజధానిప్రతినిధి,కోనసీమ -జిఎన్.రావ్ :** ప్రముఖ సినీ గాయని ఎస్.జానకి రాజోలు నియోజకవర్గం లక్కవరం వేణుగోపాల్ థియేటర్ మెగాస్టార్ చిరంజీవి నటించిన ఖైది నంబర్ 150 చిత్రాన్ని విక్షీంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరంజీవి అంటే తనకు ప్రత్యేక అభిమానమని ఖైది నంబర్ 150 చాలా బాగుందని చెప్పారు. ఎనిమిది

### గాయని జానకి

సంవత్సరాల తరువాత ఈ వయస్సులో చిరంజీవి ఇంత స్పీడుగా డ్యాన్సులు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. కోనసీమలో సంక్రాంతి వేడుకలు చాలా బాగున్నాయని, తాను బంధువుల ఇంటికి వచ్చానని ఈ సందర్భంగా బంధువుల కుటుంబ సభ్యులతో ఈ



చిత్రం చూశానని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పీటీసీ సభ్యురాలు మంగెన భూదేవి, సర్పంచ్ మంగెన అలివేలు మంగతాయారు, మంగెన నాని తదితరులు ఉన్నారు.

# ఆసియాలో ప్రమాద స్థాయిలో ఈ -వేస్టు

**మనీల :** ఆసియాదేశాల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల (ఈ-వేస్టు) అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని ఐక్యరాజ్యసమితి అధ్యయనం హెచ్చరించింది. ఆదాయాలు పెరగటంలో స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేస్తున్నవారి సంఖ్య లక్షల్లో పెరుగుతోంది. ఫోన్లేకాక ఇతర ఎలక్ట్రానిక్ సాధనాలు కొనుగోళ్లు అపారంగా పెరుగుతున్నాయి. ఇవి ప్రజల ఆరోగ్యాన్ని, వాతావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని ఆ అధ్యయనం తెలిపింది. ఇందుకు సంబంధించిన నివేదికను ఐక్యరాజ్యసమి విడుదల చేసింది. గత 5 ఏళ్లకాలంగాఈ వేస్టు 63 శాతం పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ-వేస్టును రీసైకిల్ చేయాలని, ఇందుకు వీలుకాని వస్తువులను ప్రమాదంకాని రీతిలో ధ్వంసం చేయాలని ఆ నివేదిక సూచించిది. ఈ -వేస్టు మూలంగా వాతావరణనానికి హాని కలుగకుండా చర్యలు తీసుకునేందుకు అనేక దేశాలవద్ద ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవు. ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్ల పెరుగుదల మూలంగా పలు హానికర పరిమాణాలు ఉంటాయని నివేదిక రూపొందించిన వారిలో ఒకరైన రూఎడ్జిర్ కుమార్ తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల నుంచి వినియోగించి తీసిపారేసిన ఎలక్ట్రానిక్ వస్తువుల డంపింగ్ గ్రౌండ్‌గా చైనా, భారత్ తదిరత దేశాలు ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఎలక్రాటనిక్స్ వస్తువుల రీసైక్లింగ్‌కూడా భద్రమైంది కాదని అయితే చౌకగా లభించడం వల్ల ఆయా ఫ్యాక్టరీలు వాటిని తీసుకొని మరమ్మతు కావించి విక్రయించుకుంటున్నాయి. ఫోన్లు ట్యాబ్‌లు, రిఫ్రిజిరేటర్లు, కంప్యూటర్లు, టీవీలు తదితర ఎలక్ట్రానిక్ వినియోగాలు అపారంగా పెరిగింది. చైనాలో 2010-15 మధ్యకాలంలో ఈ-వేస్టు రెట్టింపు పెరిగింది. హాంకాంగ్‌లో ఈ వేస్టు అత్యధికంగా ఉంది. ఇక్కడ 2015లో తలసరి ఈ వేస్టు 21.7 కిలోలుగా నమోదైంది. ఈ వేస్టును డంప్ చేస్తున్న నగరాల్లో సింగపూర్, తైవాన్‌కూడా ఉన్నాయి. కంబోడియా, వియత్నాం , ఫిలిప్ఫీన్స్ దేశాల్లో ఈ వేస్టు తలసరి ఒక కిలో మాత్రమే ఉంది. ఈ వేస్టు పెరిగేకొద్దీ విషరసాయినాల ప్రభావం విస్తరించి తీవ్రమైన ఆరోగ్యం, వాతావరణ సమస్యలు కలుగుతున్నాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో వినియోగంచే లోహాలను విడగొట్టేందుకు ఉపయోగించే యాసిడ్స్ మరింత ప్రమాదంగా తయారయ్యాయి. వీటినుంచి వెలువడే వాయువులను పీల్చినట్లయితే తీవ్ర ఆరోగ్య సమస్యలు కలుగుతాయి. ప్లాస్టిక్, కెమికల్స్, సర్క్యూట్ బోర్డులను మండించడం వల్ల వాయుకాలుష్యం బాగా పెరుగుతుంది.




జంగారెడ్డిగూడెంలో రాజధాని వార్తలు 2017 కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అలుగు ఆనంద్ శేఖర్

# జల్లికట్టు గెలిచింది

నాగరిక సమాజాన్ని ముందుకు నడపవలసిన సామాజిక వేత్తలు, రాజకీయపండితులు, విజ్ఞులు, విద్యావేత్తలు మౌనంగా ఉండటం, పబ్బం గడుపుకొనే రాజకీయనాయకులు, సూడోనాయకులైన సినిమా హీరోలు, ప్రజల్ని రెచ్చగొడితే ఎలా ఉంటుందో జల్లికట్టు కోసం తమిళనాడుప్రజలు చూపుతున్న అత్యుత్సాహాన్ని చూస్తే అర్థమవుతుంది.

రెండురోజుల క్రితం సుప్రీంకోర్టు నిషేధించిన జల్లికట్టును చూడటానికి వెళ్లిన షణ్ముగం అనే ఒక వ్యక్తి మరణించాడు. చెదిరిన ఎద్దులు అతనిపై పడటంతో ఈ ఘటన జరిగింది. పెయింటింగ్ పనితో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇంటిదగ్గర అతని భార్య అగర్‌బత్తీలు చుట్టి భర్తకు చేదోడు వాదోడుగా ఉంటుంది. అకస్మాత్తుగా ఆమెపై కుటుంబ భారం పడింది. ఏం చేయాలో దిక్కుతోచని వైనం. ప్రభుత్వంకాని, సామాజిక వేత్తలు కాని ఈ ఘటనను ప్రజలముందుకు తెచ్చి వారికి జల్లికట్టుపై అవగాహన కల్పించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. చిన్నపిల్లలు కత్తులు, బ్లేడ్లు కావాలని మారాం చేస్తే ఇచ్చేస్తామా...సంప్రదాయం పేరుతో ప్రజలు అన్యాయంగా బలైపోయి, కాళ్లుచేతులు విరగ్గొట్టుకొంటుంటే కుదురుతుందా ? మన సంప్రదాయం అనుకున్న చాలా వాటిని నవనాగరికత పెంచు కున్నతర్వాత వదులుకున్నాం. కొన్ని వస్తుంటాయి. మరికొన్ని పద్ధతులు పోతుంటాయి. జీవనవిధానం, నాగరికత, హింసాయుత చర్యలు వీటి బలహీనతలను మనం ఒదులుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దానిపై స్పందించాల్సినవారు మౌనంగా ఉండటం, సూడోనాయకులు ఎక్కువవడంతో తమిళ ప్రజలు అపాయానికి దగ్గరగా వెళుతున్నారనడంలో సందేహంలేదు.

జల్లికట్టులో ఎద్దులను అలంకరించి ఒక్కసారిగా ఒదులుతారు. జనసమర్థంలో ఆ జంతువులు ఆందోళనకు గురై గుమిగూడిన జనంపైకి వస్తాయి. దాంతో అనేకమంది గాయాలపాలవుతారు. ఇంతేకాకుండా ఒక్కోసారి మరణాలు కూడా సంభవిస్తాయి. రక్తం ఏరులైపారుతుంది. అందుకే సుప్రీంకోర్టుఈ జల్లికట్టుపై నిషేధం విధించింది. అయితే సాంప్రదాయ క్రీడని వాటిని మచ్చిక చేసుకుంటామని చెబుతున్న



మాటలన్నీ ఒట్టి అబద్ధాలే... వాటిని రెచ్చగొడతారు. వాటి ముకుతాడు వేసి బలంగా లాగడం, కొమ్ములను విరవడం వంటివి చేస్తారు. దీంతో జంతు సంక్షేమ సంఘం (పెటా)సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు ఈ క్రీడను నిషేధించింది. మనరాష్ట్రంలో కోడి పందేలు తమిళనాట జల్లికట్టు రాజకీయనాయకుల జోక్యంతోనే అమలు జరగటం లేదనడం అతిశయోక్తి కాదు.

పెటాసభ్యురాలిగా జల్లికట్టుపై ట్విటర్ ద్వారా వ్యాఖ్యలు చేసిన త్రిష ఆకస్మిక మరణానికి గురైందని జల్లికట్టు మద్దతుదారులు పోస్టుపెట్టడం దారుణం. అంతేకాదు ఆమె సినిమాలను కూడా బహిష్కరిస్తామనడంతో తన ట్విట్టర్‌ను ఎవరో హ్యాక్ చేశారని అభిమానులకు ఆమె క్షమాపణలు చెప్పుకోవాల్సి వచ్చింది. దీనిని విమర్శించిన రెండవవ్యక్తి హీరో విశాల్ అతడు మృతి చెందాడని పాడి కట్టేశారు. ఇది ఎంతదారుణం. ముఖ్యమంత్రులు, ప్రతిపక్షనాయకులు ఈ రాక్షస క్రీడను పునరుద్ధరించి ఓట్లు గుంజుకోవాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

**ఆత్మహత్యాయత్నం**

వేలూరు జిల్లా వాణియంబాడిలో సురేష్ అనే విద్యార్థి విద్యుత్తు స్తంభంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించి తీవ్రంగా గాయపడ్డాడు. ఆరణిలో



ఇబ్రహీం అనే విద్యార్థి సేలం కలెక్టరు కార్యాలయం వద్ద భూపాలన్ అనే యువకుడు కిరోసిన్ పోసుకుంటుడగా పోలీసులు అడ్డుకున్నారు. తిరుచ్చి చింతామణిలో హమాలి సతీష్‌కుమార్ ఆత్మాహుతికి యత్నించాడు.

**సినీతారల మద్దతు...**

మెరీనాలో జరుగుతున్న ఆందోళనలో సినీ తారలు రాఘవ లారెన్స్, 'రెమో' నటుడు శివకార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు నీళ్లు, భోజనం అందించడానికి వచ్చినట్టు లారెన్స్ తెలిపారు. నటి సమంత జల్లికట్టుకు మద్దతుగా ట్వీట్ చేశారు. షూటింగ్‌లలో పాల్గొనకూడదని సినీ, టీవీ కళాకారులు నిర్ణయించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. కార్గిల్ యుద్ధంలో విజయానికి గుర్తుగా తనకు ప్రభుత్వం ఇచ్చిన పతకాన్ని... వైమానిక గుర్తుగా మాజీ జవాను సెల్వరామలింగం సేలం జిల్లా కలెక్టరుకు అప్పగించి జల్లికట్టుకు మద్దతు ప్రకటించారు. ఇలాంటి నిరసనలు ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకు విషయంలో చేస్తే ప్రయోజనం ఉంటుంది.

## ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించిన తహసీల్దార్



**రాజధానిప్రతినిధి, కోనసీమ - జీఎన్.రావ్ :** పద్దెనిమిది ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం తహశీల్దార్ నక్కా చిట్టిబాబు సూచించారు. స్థానిక ది అమలాపురం డిగ్రీ కళాశాలలో 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులకు ఓటు హక్కు ఆవశ్యకతను తెలియజేసారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించిన జేసీ

**రాజధానిప్రతినిధి, కోనసీమ - జీఎన్.రావ్ :** సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో 200 ఎకరాల విస్తీర్ణంలో రూ.19 వందల కోట్లతో నిర్మాణం కానున్న డ్రెడ్జింగ్ హార్బర్ నిర్మాణ ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.సత్యనారాయణ పరిశీలించారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్మాణం కానున్న ఈ ప్రాజెక్టుకు త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంట అమలాపురం ఆర్డీవో జి.గణేష్‌కుమార్, సఖినేటిపల్లి మండల తహసీల్దార్ సుధాకరరావు, డిప్యూటి ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వే సత్తి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళి



**రాజధానిప్రతినిధి, కోనసీమ - జీఎన్.రావ్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు 21వ వర్ధంతిని పురస్కరించుకుని అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా తెలుగు యువత జిల్లా కార్యదర్శి చెరుకూరి సాయిరామ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరం ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సి కె.రవికిరణ్‌వర్మ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు, గంధం పల్లంరాజులు రక్తదానం చేశారు. అలాగే భాస్కర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరం వద్ద ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు, వైస్ చైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, ఎంపిపి బొర్రా ఈశ్వరరావు, జడ్‌పిటిసి అధికారి జయవెంకటలక్ష్మి, అల్లాడ స్వామినాయుడు, నల్లా స్వామి, తిక్కిరెడ్డి నేతాజీ, ఆశెట్టి ఆదిబాబు, దున్నాల దుర్గ, రాజులపూడి వెంకటేశ్వరరావు(భీముడు), యాళ్ల నాగసతీష్, పలువురు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జాతీయ వికలాంగ్ మహాసంఘటన్ ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్టీర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వికలాంగులకు వివిధ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఆయన లేని లోటు తీరనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వికలాంగ్ మహాసంఘటన్ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్, దొడ్డిపట్ల శ్రీనివాస్, చిక్కాల రవిశంకర్, అశోక్‌కుమార్, పి.సత్తిబాబు పాల్గొన్నారు.


## 25న జరగనున్న కాపు జైత్రయాత్రను విజయవంతం చేయండి



**రాజధానిప్రతినిధి, కోనసీమ - జీఎన్.రావ్ :** కాపులకు రిజర్వేషన్లు అమలుచేసే వరకూ ఉద్యమం ఆగదని కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు ఆకుల రామకృష్ణ అన్నారు. ముమ్మిడివరంలో శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో కాపు నాయకుడు గోదశి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదిన చేపట్టన్ను కాపు సమైఖ్య జైత్రయాత్రకు ఎన్ని అడ్డంకులు పెట్టినా కొనసాగిస్తామన్నారు. కోడిపందాలు, జూదాలు ఆడడానికి కోర్టులు అభ్యంతరం తెలిపినా ప్రభుత్వం వాటిని నిరభ్యంతరంగా ఆడించిందన్నారు. కాపు జైత్రయాత్రకు కోర్డు అనుమతి ఇచ్చినా ప్రభుత్వం అడ్డుకుంటుందని సమావేశంలో తీవ్రంగా ఖండించారు. తాము కొత్తగా రిజర్వేషన్లు కోరడంలేదని, ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని మాత్రమే అమలు చేయమని కోరుతున్నామన్నారు. అనంతరం గోదశి నాగేశ్వరరావు మాట్లాడుతూ కాపు జైత్రయాత్రను వియజయంతం చేసేందుకు ఈ నెల 22వ తేది మధ్యాహ్నం 2 గంటలకు ముమ్మిడివరం నియోజకవర్గ కాపు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కాపులంతా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వాసిరెడ్డి ఏసుదాసు, నల్లా విష్ణుమూర్తి, కల్వకొలను తాతాజీ, గుద్దటి జమ్మి, బోనం సూర్యం, ఆకుల లక్ష్మి, గణేశుల బ్రహ్మానందం, రాయపురెడ్డి జానకిరామయ్య, ఏడిద దొరబాబు, గోదశి పుండరీష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఆర్‌డీఏ పరిధి మరింత పెంపు

## అదనంగా 7 గ్రామాల్లోని 311.19 చదరపు కిలోమీటర్ల చేరిక



**రాజధాని ప్రతినిధి-అమరావతి :** ఆంధ్రప్రదేశ్ కేపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్‌డీఏ) పరిధిని రాష్ట్ర ప్రభుత్వం మరింత పెంచింది. ప్రస్తుతం 8603.32 చదరపు కిలోమీటర్లున్న సీఆర్‌డీఏ పరిధి.. ఏడు గ్రామాల్లోని 311.19 చదరపు కిలోమీటర్లను కలపడంతో 8,914.51 చదరపు కిలోమీటర్లకు చేరింది. గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటపాలెం, కృష్ణా జిల్లా ముసునూరు మండలం గోపవరం, బలివే, కాట్రేనిపాడు, కాళ్లపల్లి, వేల్పుచర్ల, చిల్లబోయినల్లిల్లో గల 311.19 చదరపు కిలోమీటర్లతో పాటు అటవీ భూములను సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకొచ్చారు.

**అమరావతి సినిమాకు రూ.80.80 లక్షలు**

అమరావతి సూపర్ సిటీ సినిమా కోసం 80.80 లక్షల రూపాయలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజధాని అమరావతి నిర్మాణాన్ని చిత్రీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. రాజధాని ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితిని, నిర్మాణం జరుగుతున్న ప్రక్రియను చిత్రీకరించనున్నారు. నేషనల్ జాగ్రఫీ చానల్‌కు ఈ సినిమా తీసి ప్రసారం చేయడాన్ని అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలి

## జాయింట్ కలెక్టర్ సత్యనారాయణ



**రాజధానిప్రతినిధి, కోనసీమ - జీఎన్.రావ్ :** ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరగనున్న సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సత్యనారాయణ సూచించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కళ్యాణ ఉత్సవాల ఏర్పాట్లపై అంతర్వేదిలోని స్వామివారి దేవాలయ ప్రాంగణంలో అమలాపురం ఆర్‌డివో జి.గణేష్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో జెసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. శాఖల వారీగా ఆయా శాఖలు చేపట్టే పనులను జెసి సమీక్షించారు. భక్తులకు అవసరమైన రక్షిత మంచినీటిని పూర్తిస్థాయిలో అందించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఈ అప్పారావుకు సూచించారు. స్నాన ఘట్టాల వద్ద ఏవిధమైన ప్రమాదాలు సంభవించకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. స్నాన ఘట్టాల వద్ద ప్రమాద పరిస్థితిని ఎదుర్కొనేందుకు 60మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేస్తున్నట్లు మత్స్యశాఖ డిడి అంజలి తెలిపారు. ఉత్సవాలు జరిగే అన్ని రోజులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచడం జరుగుతుందని ఎడిఎం అండ్ హెచ్‌వో పుష్కరరావు తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అంబులెన్స్‌లు సిద్ధం చేస్తున్నామని అన్నారు. ఉత్సవాలు జరిగే అన్ని రోజులు ఆలయం చుట్టుప్రక్కల ఎక్కడా మద్యం, మాంసం అమ్మకాలు పూర్తిగా నిషేధించాలని జెసి ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ఉత్సవాల్లో ఏవిధమైన తొక్కిసలాటలు జరగకుండా పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, తలంబ్రాలు పంపిణీ విషయంలో మరింత పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. షెడ్లు, డ్రెస్ ఛేంజింగ్ కంపార్ట్‌మెంట్లు, లైటింగ్ ఏర్పాట్లు పంచాయతీరాజ్ శాఖ తరపున ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు జెసికి తెలిపారు. ఆర్టీసి నుంచి ఉత్సవాలు జరిగే అన్ని రోజులు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివిధ ఆర్టీసి డిపో మేనేజర్లు తెలిపారు. భక్తులకు సహాయ సహకారాలు అందించేందుకు విద్యాశాఖ నుంచి ఎన్‌సిసి, స్కౌట్ విద్యార్థులను పంపుతున్నట్లు డిప్యూటీ డిఈవో ఆర్.గంగాభవాని తెలిపారు. దేవాదాయ శాఖ తరపున 70మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు సిఎఫ్‌వో రమేష్‌బాబు తెలిపారు. ఆలయ ఈవో సిహెచ్.వెంకట్రావు మాట్లాడుతూ రూ.1.20కోట్లు మంజూరైన రథం రోడ్డు పూర్తయితే మరింత సౌకర్యవంతంగా ఉంటుందని, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ సాయిబాబురాజు, సిఎఫ్‌వో సురేష్‌బాబు, సఖినేటిపల్లి ఎంపిపి లక్ష్మీసరస్వతి, జెడ్‌పిటిసి రావి దుర్గాఅలేంద్రమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. తొలుత జెసికి ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులు స్వాగతం పలుకగా జెసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పరీక్షల్లో పొరపాట్లు పునరావృతం కాకూడదు

**అధికారులకు ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి ఆదేశం**



**రాజధాని ప్రతినిధి-అమరావతి :** గతంలో పరీక్షల నిర్వహణలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని ఇంటర్మీడియెట్ విద్యా మండలి కార్యదర్శి బి. ఉదయలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఇంటర్ బోర్డు ఇచ్చిన సూచనలను విధిగా పాటించాలని స్పష్టం చేశారు. కృష్ణాజిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 28,31 తేదీల్లో జరగబోయే ప్రథమ సంవత్సరం ఇంటర్ మానవ విలువలు, పర్యావరణ నిర్వహణ పరిజ్ఞానం పరీక్షలకు, ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్స్ నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఈ విద్యా సంవత్సరంలో తీసుకువచ్చిన మార్పులపై చర్చించారు. ప్రథమ ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ద్వితీయ ఇంటర్ ప్రాక్టికల్స్ 977 పరీక్ష కేంద్రాలలో జంబ్లింగ్ విధానంలో జరుగుతాయన్నారు.

# రోహిత్ వర్ధంతి సభ భగ్నం

**హైదరాబాద్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. భారీ ఎత్తున పోలీసులను మోహరించారు. వర్సిటీ క్యాంపస్ పోలీసు వలయంగా మారింది. రోహిత్ వేముల ప్రథమ వర్ధంతి సభను నిర్వహించి తీరుతామని విద్యార్థులు స్పష్టం చేయగా, వారిని గేటు వద్దనే పోలీసులు అడ్డుకున్నారు. దాంతో తోపులాట జరిగింది. రోహిత్ వేముల చట్టాన్ని తీసుకురావాలంటూ విద్యార్థుల నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. సభ జరిపేందుకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేస్తుండగా, విశ్వవిద్యాలయంలో సభ నిర్వహించుకునే హక్కు ఉందంటూ విద్యార్థులు వాదించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోహిత్ వేముల మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని విద్యార్థులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కేంద్ర మంత్రులు స్మృతి ఇరానీ, బండారు దత్తాత్రేయలను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని, వైస్ ఛాన్సలర్ అప్పారావును తక్షణ మే తొలగించాలని విద్యార్థులు డిమాండు చేశారు. రోహిత్ తల్లి రాధికను సైతం పోలీసులు అడ్డుకున్నారు. తల్లిని కూడా విశ్వవిద్యాలయంలోకి అనుమతించక పోవడం దుర్మార్గమైన చర్య అంటూ విద్యార్థులు

**విద్యార్థుల ఆందోళన**

మండిపడ్డారు. క్యాంపస్ నుంచి ప్రధాన గేటు వరకు విద్యార్థులు ప్రదర్శనగా తరలివచ్చారు. పోలీసులు గేటుకు తాళాలు వేసి వారిని నిలువరించారు. రోహిత్ వేముల కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థులు పట్టుబట్టారు. వర్సిటీ క్యాంపస్‌లోకి వెళ్లేందుకు ఎందుకు అనుమతించరంటూ వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తామేమైనా ఉగ్రవాదులమా, నక్సలైట్లమా అంటూ ప్రశ్నించారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా తమ పోరాటాన్ని కొనసాగించి తీరుతామని విద్యార్థులు స్పష్టం చేశారు. గత ఏడు సంవత్సరాలలో 9 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారంతా దళితులేనని విద్యార్థులు ఆవేదనను వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. రోహిత్ వర్ధంతి కార్యక్రమాన్ని కవర్‌చేసేందుకు వర్సిటీ ప్రాంగణానికి వచ్చిన సీనియర్ జర్నలిస్ట్ ఫ్రంట్‌లైన్ కరెస్పాండెంట్ కునాల్ శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌కు తరలించి గంట పాటు ప్రశ్నించి, ఆ తరువాత వదిలిపెట్టారు. రోహిత్ వేముల మరణం వ్యవస్థీకృత హత్య అని ఇందుకు కారణమైన వారిపై తిరుగుబాటు తప్పదని యునైటెడ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఏపీ ఎమ్మార్పీఎస్, మాలమహానాయుడు సంయుక్తంగా హెచ్చరించారు. స్థానిక అంబేద్కర్ కళాశాల సమీపంలోని ధర్నా పాయింట్ వద్ద రోహిత్ వేముల ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థి సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పమిడిపాటి కోటయ్య, తలతోటి సుధాకర్, బాబి, కళాశాల కరస్పాండెంట్ షీలా సుజని, పిల్లి సుధాకర్‌లు ఉన్నారు. కాగా అంబేద్కర్ ఆశయాల మేరకు ఉన్నత విద్యను అభ్యసిస్తున్న రోహిత్ వేముల బలవన్మరణం బీజేపీ ప్రభుత్వ వ్యవస్థీకృత హత్యగా ఆరోపించారు. రోహిత్ తల్లి రాధికమ్మ తన బిడ్డ మృతిపై దేశ వ్యాప్త ఉద్యమం చేస్తూ నిర్దిష్ట ఆరోపణలు చేసి విచారణ జరపాలని కోరినా కూడా ఇప్పటివరకు ఎటువంటి విచారణ జరపకపోవడం గమనిస్తే వారి ప్రమేయం బయటకు రాకుండా తప్పించుకునే ప్రయత్నం పాలకవర్గాలు చేస్తున్నట్లు ఆరోపించారు. దళిత విద్యార్థులు పిడికిలి బిగించి గ్రామస్థాయి తిరుగుబాటుకు పాల్పడితే అక్రమ ప్రభుత్వ మూలాలు కూకటివేళ్లతో పెకలిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.విక్టర్, హర్షవర్ధన్, అందే రాజేష్, హేమంత్, సూరజ్, ప్రవీణ్, మదిర రవి తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సైడ్ కాల్వల నిర్మాణం



**రాజధాని ప్రతినిధి- రాయపూడి :** నవ్యాంధ్ర రాజధాని రాయపూడి గ్రామం దళితవాడలలో మురుగు నీరు పారుదలకు సైడ్ కాల్వల నిర్మాణం జరుగుతుంది. ముందుగా సర్పంచ్ రెంటపల్లి నాగమణెమ్మ ఇంటి వద్ద నుండి మెయిన్ ఆర్.అండ్ బి. రోడ్డు వరకు ప్రధాన కాల్వలోకి మురుగు నీరు మళ్లించేదుకు వీలుగా నిర్మాణం చేస్తున్నారు. రాజధాని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనలో భాగంగా సైడ్ కాల్వల నిర్మాణం జి.పి : సాధారణ నిధులును నిర్మాణ పనులకు కొనసాగుతున్నాయి.

# ఆశల పల్లకీలో అమెరికా యువత

అమెరికా ప్రజలు అంతకుముందు ఎన్నడూ లేని విధంగా ఒక కొత్త ఒరవడిని సృష్టించుకున్నారు. ఆ దేశ అధ్యక్షుల్లో ఇప్పటివరకు ట్రంప్ లాంటి వ్యక్తికి పట్టం కట్టలేదు. ట్రంప్ రాజకీయాల్లోకి రాకముందు రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ఉన్నారు. అమెరికా చట్టాల్లోని లొసుగులతో రుణాల ఎగవేతకు పాల్పడి, బ్యాంకులను దివాళా తీయించాడు. మహిళలంటే ఏమాత్రం గౌరవం లేని, అణువణువునా డబ్బు అహంకారం నిండిన వ్యక్తి. ప్రపంచవ్యాప్తంగా జూదగృహాలు, వేశ్యావాటికలు, రియల్ ఎస్టేట్ వెంచర్లను నడుపుతున్నారని ఆయన వ్యతిరేకులు చెబుతుంటారు. అందాల పోటీలు, షోబిజినెస్, సినిమాల్లో ఆయన అపార సంపద పోగేసుకున్నారు. అమెరికా బద్ద శత్రువు రష్యా చేతిలో కీలుబొమ్మగా మారారని అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ మాజీ అధికారి కూడా తేల్చి చెప్పారు.



**అమెరికా అధ్యక్ష ప్రమాణానికి హాజరైనవారు, టీవీల ఎదుట కూర్చున్న వారికి ట్రంప్ ప్రసంగం భారతదేశంలోని ప్రాంతీయ పార్టీలు చేసే ఎన్నికల వాగ్దానంలా అనిపించింది. ఆఖరికి పాలన ప్రజలదగ్గరకు తెస్తానన్న వాఖ్యం కూడా... అంతేకాని ప్రపంచంలోని అగ్రదేశం స్థాయిలో ఆయన ప్రసంగం లేదు.** ఎన్నికల్లో అలుపెరుగని పోరాటం చేసిన హిల్లరీ క్లింటన్ గురించి కూడా ఎక్కడా ఆయన పేర్కొనకపోవడం రాజకీయ పండితులకు విస్మయం కలిగించింది. అమెరికా యువతకు ఉపాధి కల్పించడమే తన ధ్యేయంగా చెప్పుకొచ్చారు. 16 ఏళ్లకే ఇంటినుంచి వేరై తమ బ్రతుకు పోరాటం, స్వేచ్ఛా జీవితంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ అమెరికా పౌరులు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి ఉద్యోగాలు ఇతర దేశాలవారు పొందుతున్న మాట వాస్తవం. ఈ క్రమంలో ఇప్పటికిప్పుడు అమెరికా యువత ఉపాధి పొందటం అంత సులువుకాదనే వాస్తవం త్వరలోనే తెలుస్తుందని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఇతరదేశాలకు సైన్యాన్ని పంపటం, ట్రిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టడం కూడా ఆయన వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే హెచ్ 1బీ వీసాకోసం నూతన నిబంధనలు విధించి వలసలను నిరోధిస్తామంటున్నారు. ఏది ఏమైనా ఇప్పటివరకు ప్రపంచ దేశాలకు పెద్దన్న పాత్ర పోషించిన అమెరికా పెను మార్పులకు లోనవ్వనుంది.

> ఏది ఏమైనా ట్రంప్ అనూహ్య గెలుపు వెనుక తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరాని చెందిన ఇరగవరపు అవినాష్ ఉన్నాడనేది నిజం.. అమెరికా ప్రజలను కూడా భారత దేశ ప్రజలమల్లే మొదటిసారిగా భ్రమలు కల్పించిన వాడిగా ఆయన పేరు చేర్చక తప్పదు. విదేశాల్లో భారతీయులు వేర్పాటువాదాన్ని, అణచివేతను ఎలా చొప్పిస్తున్నారో మరొక సారి సమీక్షిద్దాం...

అగ్రదేశాధ్యక్షుడి ప్రస్థానం....

అమెరికా చరిత్రలో అత్యంత అసాధారణ అధ్యక్షుడిగా ట్రంప్ శ్వేతసౌధ పీఠం అధిరోహించారు. నవంబరు ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన విజయాన్ని నమోదు చేసుకున్న తర్వాత 50 ఏళ్ల క్రితం నాటి బంధుప్రీతి వ్యతిరేక చట్టాన్ని నవాలు చేస్తూ ట్రంప్ తన అల్లుడు జార్డే కుషెనెరెను తన సీనియర్ సలహాదారుగా నియమించడంతో సహా అనేక వివాదాస్పద నియమాకాలను చేపట్టారు. ట్రంప్ బృందంలో ప్రముఖ ఇంధన సంస్థ ఎక్సాన్‌మొబిల్ సీఈవో రెక్స్ టిలెర్సన్‌ను దేశ కార్యదర్శిగా, రిటైర్డ్ మెరైన్ జనరల్, ఒబామా పాలనాయంత్రాంగాన్ని విమర్శించిన జేమ్స్ మాటిస్‌ను రక్షణ కార్యదర్శిగా నియమించారు. అలాగే స్టీవ్ బానన్‌ను ప్రధాన వ్యూహకర్తగా, సీనియర్ సలహాదారుగా నియమించారు. శ్వేత జాత్యహంకారుల 'ఆల్ రైట్' ఉద్యమంతో సంబంధాలున్న అతివాద నాయకుడిగా బానన్‌కు పేరుంది. దీంతోపాటు మిలియనర్లు, బిలియనీర్లను కూడా తన బృందంలో చేర్చుకోవడంతో ఆధునిక అమెరికా చరిత్రలో అత్యంత సంపన్నులతో కూడిన పాలనా యంత్రాంగాన్ని డొనాల్డ్ ట్రంప్ రూపొందించుకున్నాడు. ట్రంప్ తన రాజకీయ అరగ్రేటానికి వారం రోజుల ముందు, తన వ్యాపారాన్నింటినీ కుమారులు జూనియర్ డొనాల్డ్, ఎరిక్‌లకు అప్పగించారు. అమెరికాను గొప్పదేశంగా మరోసారి తయారు చేయడం నివాదంతోనే ట్రంప్ అధికారంలోకి వచ్చాడు. అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అక్రమ వలసదారులను నియంత్రించేందుకు మెక్సికో సరిహద్దు వద్ద ఒక గోడ నిర్మిస్తానని హామీలిచ్చారు. పెద్ద సంఖ్య ఉద్యోగాలు కల్పించే వ్యక్తి తానేనంటూ చెప్పుకొచ్చిన ట్రంప్ రానున్న రెండు వారాల్లో ఆవిషయమై పెద్ద ప్రకటన చేస్తానని తెలిపారు. తన ప్రమాణ స్వీకారం నేపథ్యంలో రష్యా తనను ఏన్నో ఏళ్లుగా ప్రోత్సహించిదని, తనకు సంబంధించిన సమాచారం పట్ల సంతృప్తికరంగా ఉందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టంచాయి. అలాగే, తాను వేధిస్తూ వెంటాడుతున్నానన్న ఆరోపణలను ఆయన త్రోసిపుచ్చుతూ,'నాజీ జర్మనీలో నివసించినట్లు' ఉందని ఆగ్రహంతో అన్నారు. నాజీ జర్మనీ అనే పదం వాడినందుకు తనను యూదు గ్రూపులు విమర్శిస్తూ క్షమాపణ కోరుతున్నాయని పేర్కొన్నారు. న్యూయార్క్‌కు చెందిన రియల్ ఎస్టేట్ ప్రముణ వ్యాపారి ఫ్రెడ్ ట్రంప్‌కు నాటుగో కుమారుడిగా ట్రంప్ క్వీన్స్‌లో జన్మించారు. వార్టన్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. కంపెనీలో చేరడానికి ముందు తన తండ్రి నుంచి ఒక మిలియన్ డాలర్లు రుణంగా తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ట్రంప్ ప్రారంభించారు. 1971 ట్రంప్ ఆర్గనైజేషన్ పేరుతో కంపెనీని తన అధీనంలోకి తీసుకున్నాడు. అత్యంత విలాసవంతమైన మన్‌హట్టన్ ప్రాజెక్టులకు క్విన్స్, బ్రూక్లిన్‌లో గృహ సముదాయాల నుంచి కుటుంబ వ్యాపారంగా మార్చాడు. ప్రస్తుతం ఆయనకు చెందిన సిగ్నేచర్ టవర్స్ అత్యంత విలాసవంతమైన నివాసం. అయితే తన రియల్ వెంచర్స్‌లో వరుస నష్టాలతో దివాళా తీశాడు. కాంట్రాక్టర్లును చెల్లింపులు కూడా జరపలేదన్న ఆరోపణలు ఎదుర్కొనాడు, ప్రపంచవ్యాప్తంగా సొంతంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని విస్తరించాడు. వినోద వ్యాపారంలోకి కూడా అడుగిడాడు. 1996 నుంచి 2015 వరకు మిస్ యూనివర్స్, మిస్ యూఎస్ఏ, మిస్ టీవ్ యూఎస్ఏ అందాల పోటీ నిర్వాహకుడిగా వ్యవహరించారు.

– ఖాన్

## ప్రజలవెంటే ఉంటా...

### భావోద్వేగంగా ఒబామా లేఖ



**వాషింగ్టన్ :** ప్రతి అడుగులోనూ అమెరికా ప్రజలతోనే ఉంటానని వాగ్దానం చేస్తూ... శ్వేత సౌధం వీడిన నల్లకలువ ఒబామా... భావోద్వేగాలతో ప్రజలకు వీడ్కోలు లేఖ రాశారు. తనకు బలాన్నిచ్చిన ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'మనం'గా జీవిద్దామని పిలుపునిచ్చారు. ఈ ఎనిమిదేళ్లూ నాకు బలాన్నిచ్చిన మంచితనం, సామర్థ్యం, సాఫల్యతలకు మీరే ఆధారమయ్యారని, తీవ్ర ఆర్థిక సంక్షుభిత సమయాల్లోనూ ఒకరికొకరుగా అన్నట్లు పొరుగువారికి సాయంగా నిలిచిన ప్రజలను చూశానన్నారు. 45వ అధ్యక్షుడికి ఈ స్థానాన్ని అప్పగించే ముందు 44 వ అధ్యక్షుడిగా సేవలందించే గౌరవాన్ని కల్పించిన మీకందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. అధ్యక్షకార్యాలయంలో ఉన్న సమయంలో నేను నేర్చుకున్నదంతా మీ నుంచే.. మీరు నన్ను మంచి అధ్యక్షుడిని, మంచి మనిషిని చేశారన్నారు. యువపట్టభద్రులు, కొత్త సైనికాధికారుల అకాంక్షల నుంచి స్థైర్యాన్ని, ధైర్యాన్ని పొందానని, అచేతనంగా పడివున్న వ్యక్తి తిరిగి కోలుకోవడానికి.. గాయపడిన వీరులు లేచి నడవడానికి మన శాస్త్రవేత్తలు సహకరించడాన్ని చూశానని శ్లాఘించారు. అన్ని విషయాల్లో అమెరికన్ల హుందాతనం, దృఢ సంకల్పం, మానవత్వం, దయా గుణం చూశానన్నారు. శాంతి కోసం పనిచేయడంలో.. శరణార్థులను ఆదరించడంలో మన పిల్లల ఔదార్యాన్ని చూశాను, దేశ పౌరులుగా మీ చర్యల్లో భవిష్యత్తు వికాసాన్ని చూశాను. పార్టీలకు అతీతంగా మనమంతా అందరికీ సంతోషాన్ని పంచాలి. ఎన్నికలొచ్చినప్పుడో.. స్వప్రయోజనాల కోసమో కాదు. జీవితాంతం ఇలాగే ఉండాలి. మీ మార్గంలో – ప్రతి అడుగులోనూ నేనుంటాను. అమెరికా ఏ ఒక్కరి ప్రాజెక్టు కాదు. మన ప్రజాస్వామ్యంలో ఏకైక శక్తివంతమైన పదం 'మనం' అని స్ఫూర్తిదాయక లేఖలో పేర్కొన్నారు.

# విశాఖలో ఖైదీ నెం.150 విజయోత్సవం



మెగాస్టార్ చిరంజీవి ఖైదీ నెం.150 సూపర్ సక్సెస్ అయింది. ఈ సినిమా విడుదలకు ముందు గుంటూరులో ప్రీ సక్సెస్ మీట్ చేసారు. ఇప్పుడు సినిమా విడుదల, బ్లాక్ బస్టర్ అయిన సందర్భంగా మరో విజయోత్సవాన్ని జరపాలని నిర్ణయించారు. ఈ విజయోత్సవాన్ని విశాఖలో లేదా హైదరాబాద్‌లో చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో అభిలాష లాంటి కొన్ని సినిమాలకు విశాఖలో విజయోత్సవ సభలు జరిపారు. ఇప్పుడు మళ్లీ అలాగే అక్కడే విజయోత్సవ సభ జరపాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మెగా శిబిరానికి ఆప్తుడయిన మంత్రి గంటా శ్రీనివాసరావు మెగా కుటుంబానికి దగ్గరివాడు కావడంతో ఆయన అండదండలు అక్కడ పుష్కలంగా లభిస్తాయి. గుంటూరు సభ అనుమతి ఇవ్వకపోవడం, వంటి వ్యవహారాలు వుండడంతో గంటా గుంటూరు కార్యక్రమానికి దూరంగా వున్నారు.

కొత్త రికార్డులు సృష్టించే దిశగా ఖైదీ పయనిస్తోంది. ఇప్పటికి ఎనిమిది కోట్ల వరకు షేర్ వచ్చింది. ఇప్పుడు అక్కడ సభ జరిపితే, మరింత ముందుకు సాగి, పది కోట్ల మార్కును దాటే అవకాశం వుంది. ఇది ఉత్తరాంధ్ర కే కొత్త రికార్డు అవుతుంది. అందుకే విశాఖలోనే సభ జరిపేందుకు సినీపెద్దలు అల్లు అరవింద్ కృషి చేస్తున్నారు. సంక్రాంతికి పోటాపోటీగా విడుదల అయిన మెగాస్టార్ చిరంజీవి, నందమూరి నటసింహం బాలకృష్ణల సినిమాలు ఓవర్సీస్ లో సాధిస్తున్న వసూళ్లను పోల్చి చూస్తే మెగాస్టార్ ది పూర్తి ఆధిపత్యంగా కనిపిస్తోంది. ఈ సినిమాల తొలి రెండు రోజుల వసూళ్ల మార్కును పరిశీలించి చూస్తే ఈ విషయం స్పష్టం అవుతోంది.





సినీ పండితుడు తరణ్ ఆదర్శ్ ఇస్తున్న సమాచారం ప్రకారం చిరంజీవి సినిమా తొలి రెండు రోజుల్లో 9.74 కోట్ల రూపాయలను వసూలు చేసి, రెండో రోజే సినిమా ఒకటిన్నర మిలియన్ మార్కును దాటేసింది.

ఇక శాతకర్ణికి సంబంధించి తొలి రెండు రోజుల గణాంకాలను కూడా తరణ్ ట్వీట్ చేశాడు. బాలయ్య సినిమా 4.67 కోట్ల రూపాయలను వసూలు చేసింది. ఈ గణాంకాల ప్రకారం రెండో రోజుకు కూడా బాలయ్య సినిమా మిలియన్ డాలర్ల మార్కును దాట లేదు. చిరంజీవి సినిమా మాత్రం తొలి రోజే మిలియన్ మార్కును అందుకుంది.

చిరు సినిమాతో పోల్చి చూస్తే తొలి రెండు రోజుల్లో కచ్చితంగా సగం స్థాయి వసూళ్లను సాధించింది బాలయ్య సినిమా. చిరుది కేవలం మాస్ ఎంటర్ టైనర్ గా, బాలయ్యది చారిత్రక నేపథ్యం ఉన్న సినిమాగా, ఎన్ఆర్ఐలను ఆకట్టుకోగల సబ్జెక్టుగా ప్రచారం లభించినా మెగాస్టార్ సినిమాదే పై చేయిగా నిలవడం గమనార్హం. చిరంజీవి పున:ప్రవేశ ప్రభావం అయి ఉండవచ్చు.

–ఖాన్

# త్వరలో బాలయ్య దర్శకత్వం ..!

తనకు దర్శకత్వం వహించే ఆసక్తి ఉందన్నారు నందమూరి బాలకృష్ణ . తను దర్శకుడిగా నటుల నుంచి మంచి నటనను రాబట్టుకోగలను అని కూడా ఆయన ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తన దర్శకత్వంలో ఆరంభమైన 'నర్తనశాల' సినిమాకు తగిన నటీనటులు లభిస్తే ఆ సినిమా తిరిగి పట్టాలెక్కుతుందన్నారు. తన ఊహల స్థాయికి మరొకరు చేరుకోలేరని, వీలు కుదరగానే దర్శకత్వం వహిస్తానని బాలకృష్ణ తెలిపారు. ద్రౌపది పాత్రలో తను ఇప్పటి వరకూ సౌందర్యను తప్ప మరొకరిని ఊహించుకోలేకపోతున్నాను అని, భీముడి పాత్రకు శ్రీహరికి ధీటైన నటుడు రాలేదని.. ఇలాంటి పాత్రలకు తగిన ప్రత్యామ్నాయ వ్యక్తులు సినిమాకు దొరికితే తిరిగి ఆ సినిమా ప్రారంభిస్తానన్నారు. తన నిర్మాణంలో వచ్చే సినిమా ఈ ఏడాదిలోనే ఆరంభం అవుతుందని చెప్పాడాయన. తన తనయుడి సినిమా కూడా ఈ ఏడాది చివరికి ఆరంభం అవుతుందని తెలిపారు. 'ఆదిత్య-999' సినిమా కాన్సెప్ట్ చక్కగా కుదిరిందని, దాన్ని మరింత మంచి కథగా రూపొందించాలన్నారు. ఆ సినిమాలో తనయుడు మోక్షజ్ఞ కూడా నటిస్తాడని, తామిద్దరం కలిసి నటించడానికి అది తగిన సినిమా అని బాలయ్య అన్నాడు. అలాగే ఇంకా ఒక పౌరాణిక సినిమా చేసే ఆలోచన ఉందని, అది మల్టీ స్టారర్ అని.. ఇతర హీరోలెవరో ఇప్పుడే చెప్పనని బాలయ్య అన్నారు. మొత్తానికి బాలయ్య అభిమానులను సంతోషపరిచే వార్తలే చెబుతున్నారు. దర్శకత్వం, నిర్మాణం, మోక్షజ్ఞతో కలిసి సినిమా, పౌరాణిక సినిమా.. ఇవన్నీ కూడా బాలయ్య ప్లానింగ్ లో ఉన్నాయి. ఫ్యాన్స్ కు ఇంతకు మించిన ఆనందాలు లేవేమో!



### శాతకర్ణిలో డిస్ట్రిబ్యూటర్ల చేతివాటం

తెలుగుజాతి చరిత్రను నేటితరాలు తెలుసుకోవాలన్న లక్ష్యంతో ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు వినోదపన్ను మినహాయింపు నిచ్చాయి. టికెట్ ధరపై ప్రేక్షకుడు 25శాతం రాయితీ కల్పించే విధంగా ఈ నెల 9న జీవో నెంబరు 14ను విడిదల చేశాయి. అంటే రూ.100 టికెట్‌ను 75లకే అమ్మాల్సి ఉండగా తెలుగురాష్ట్రాల్లో ఒక్క థియోటర్‌లోకూడా టికెట్ రేట్లు తగ్గించలేదు. కమర్షియల్ టాక్స్ అధికారులు థియోటర్ల పరిశీలన చేపట్టలేదు. రెండు రాష్ట్రాల్లో కలిపి 2 వేల థియోటర్లు ఉండగా గౌతమీపుత్రశాతకర్ణి 600 థియేటర్లలో రిలీజైంది. గతవారం 90 కోట్ల రూపాయలు కలెక్షన్ చేసింది. ప్రతిటికెట్‌కు 25 శాతం చొప్పున అంటే ప్రజల సొమ్ము రూ.20 కోట్లను డిస్ట్రిబ్యూటర్లు స్వాహా చేశారు.

– బోస్

## 10 నుంచి 12 వరకు మహిళా పార్లమెంటేరియన్ల సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

కల్పించానని గుర్తు చేశారు. అలాగే డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి వారికి ఆర్థిక భద్రత కల్పించానన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 86 లక్షల వరకు డ్వాక్రా మహిళలు ఉన్నారని, ఇటీవల 33 వేల మందికి 4,200 కోట్ల స్థిర ఆస్తులు వారి పేరు రిజిస్ట్రేషన్ చేశామని చెప్పారు. ప్రభుత్వంలో మహిళల ప్రాతినిధ్యం కల్పించడానికి ఆర్టీసీ కండక్టర్లుగా, డ్రైవర్లుగా, పోలీస్ కానిస్టేబుళ్లుగా నియామకాలు చేశామన్నారు. మహిళా, పురుషులకు సమాన హక్కుతో పాటు సమాన హోదా కూడా ఉండాలని, అప్పుడే సమసమాజం నిర్మాణ జరుగుతుందన్నారు. శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్ మాట్లాడుతూ మహిళా సాధికారిత సంబంధించి పురోగతి సాధించడానికి ఈ జాతీయ మహిళా పార్లమెంటరీ సదస్సు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సదస్సు విజయవంతానికి నగరంలో వివిధ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు దాదాపు 15వేల మంది అందుబాటులో ఉన్నారన్నారు. 2,590 కాలేజీలకు ఆహ్వానాలు అందించామని, ఒక్కో కాలేజీ నుంచి 5 మంది విద్యార్థినులు, ఒక ఫ్యాకల్టీ మెంబర్ కావాలని కోరామని చెప్పారు. స్థానిక సంస్థల మహిళలు, మహిళా మేయర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, 29 రాష్ట్రాల స్పీకర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలుగా ఉన్న మహిళా ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఆఫ్రికా, అమెరికా, బంగ్లాదేశ్, శ్రీలంక లాంటి దేశాల నుంచి పేరన్నికగన్న మహిళలు హాజరవుతారని చెప్పారు. చివర రోజు మహిళా రన్ నిర్వహిస్తామని, మహిళా సాధికారిత గురించి చర్చించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 18 సన్నాహక కమిటీలు వేశామని, మూడు నెలల నుండి మహిళా సదస్సుకు సంబంధించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాబోయే 25 రోజుల పాటు దీనికి సంబంధించి కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. శాసనమండలి చైర్మన్ చక్రపాణి మాట్లాడుతూ జాతీయ మహిళా పార్లమెంటరీ సదస్సు ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం సంతోష దాయకమన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి పీతల సుజాత, జాతీయ మహిళా పార్లమెంటరీ కన్వీనర్ రాహుల్ వి.కరత్, మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని నాని, జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, ఉన్నత విద్యా శాఖ ప్రధాన కమిషనర్ సుమిత్రాదావ్రా, జిల్లా కలెక్టర్ బాబు ఎ, పోలీస్ కమీషనర్ గౌతంసవాంగ్, మేయర్ కోనేరు శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ జి.వీరపాండియన్, సబ్‌కలెక్టర్ సలోనిసిదానా పాల్గొన్నారు.


## కాపు మహిళల స్వయం ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ

### ఎ.పి.కాపు కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా నవీన్.


**రాజధాని ప్రతినిధి- కొయ్యలగూడెం, అన్నంరెడ్డి సుబ్బారావు :** కాపులను ఆర్థికంగా బలోపేతం చేయటానికి, విద్య పారిశ్రామిక రంగాలలో వారిక మంత్రి చంద్రబాబునాయుడు కాపు కార్పొరేషన్ ఏర్పాటుచేసి, సమృద్ధిగా నిధులుయిచ్చారని ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రా నవీన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఫైనాన్స్ కార్పొరేషన్, కాపు సంక్షేమ అభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 18-50యేళ్లవయసు కాపు యువత మహిళలకు నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ తరగతులను కొయ్యలగూడెంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక పరింపూడి సర్పంచ్ గంజిమాలదేవి అధ్యక్షతన జరిగిన సభలోముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు నిర్వహించిన ఎర్రా సందర్భంలోను, ఎన్నికల మేనిఫెస్టోలోను హామీ ఇచ్చిన విధంగా కాపులను బి.సి.లలో చేర్చే ప్రక్రియలు బి.సి. కమిషనర్‌ను నియమించారని కాపు కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనివ్వటానికి కాపురేషన్ ఏర్పాటుచేసి నిధులు ఇచ్చారని నవీన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. కాపు యువతులు, మహిళలకు న్యాయం ఉపాధి అవకాశాలు వేరు పరచటంకోసం వివిధ ట్రేడ్‌లలో శిక్షణ ఇవ్వటానికి నిర్ణయించారని దానిలో భాగంగానే ముందుగా కుట్టుమిషన్ శిక్షణ తరగతులను ప్రారంభించారని తెలిపారు. కాపు మహిళలు ముగ్గురు లేక అయిదుగురు బృందంగా ఏర్పడి పరిశ్రమలు స్థాపించాలనుకుంటే వారికి రుణ సౌకర్యం కల్పించటంతోపాటు ఒక్కొక్క గ్రూపునకు రూ.10లక్షలు సబ్సిడీగా ప్రభుత్వం ఇస్తుందన్నారు. జిల్లాలో తొలివిడతగా 4 వందల మందికి 4 కేంద్రాలలో 3.నెలల పాటుకుట్టు పనిలో శిక్షణయిస్తున్నట్లు ఆమె తెలిపారు. శిక్షణ అనంతరం శిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లు పంపిణీ జరుగుతు ఒదన్నారు. ఎం.పి.పి. అయిన పర్తిచందన శ్రీదేవి, సర్పంచ్ గంజిమాల దేవి, తడికెలపూడి మహిళ ప్రాంగణం జిల్లా మేనేజరు ఎం.ఉమాదేవి కూడ ప్రసంగిస్తు చైర్మన్ పారేపల్లి రామారావు కూడా పాల్గొన్నారు.


















# కాలే కడుపుతో కాపలానా ..?

**ఎదురుగా ఉన్న శత్రువును ఎదుర్కోవడం కన్నా ఇంటిలోని శత్రువును ఎదుర్కోవడం చాలా కష్టం అలాంటి కష్టం ఇప్పుడు సైనిక, పారాసైనిక బృందాలకు దాపురించింది...**

ప్రతిక్షణం అప్రమత్తంగా వ్యవహరిస్తూ.. కంటికి రెప్పలా దేశాన్ని కాపాడుతున్న సైనికులకు ప్రజలు నీరాజనాలు పడుతున్నా...కేంద్ర ప్రభుత్వం మాత్రం వారి పట్ల అత్యంత హీనంగా ప్రవర్తిస్తోంది. దానికి తార్కాణమే బీఎస్ఎఫ్ జవాను తేజ్‌బహదూర్ పోస్టు చేసిన నీళ్ల టీ, అట్టల్లా ఉన్న చపాతీ వీడియో... క్రమశిక్షణ పేరుతో సైనికులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకపోవడం భరతజాతిని వేధిస్తోంది. అతని తర్వాత మరికొంతమంది పారామిలటరీ సైనికులు ఈ ఆహారం గురించి, ఇబ్బందుల గురించి వీడియోలు పోస్టు చేసిన విషయం తెలిసిందే.. నిజానికి తేజ్‌బహదూర్ చాలా పాత విషయాన్ని కొత్తగా చెప్పారంతే... ఇది ఈనాటి సమస్యకాదు.

1999లో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా భారత్ -పాకిస్థాన్‌లకు కార్గిల్ యుద్ధం జరిగింది. ఆసమయంలో అటల్‌బీహారీ వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్నారు. దానిలో ఎందరో తమ ప్రాణాలను అర్పించారు. అలాంటి వారిలో మేజర్ పద్మపాణి ఆచార్య ఒకరు. యుద్ధంలో అసువులు బాసే సమయానికి ఆయన భార్య చారులత ఆరునెలల గర్భవతి. పద్మపాణి తల్లిదండ్రులు విమలాచార్య, జగన్నాధాచార్యులు. జగన్నాధాచార్యులు ఎయిర్ ఫోర్సు వింగ్ కమాండర్‌గా పనిచేసి పదవీవిరమణ పొందారు. **పద్మపాణి మరణంతో పుత్రశోకం అనుభవిస్తున్న విమలాచార్య మాటలు ఎప్పటికీ గుర్తుంచుకోవలసి ఉంటుంది. అదేమంటే మిలటరీ క్యాంటీన్లలో కూడా చాలా నాసిరకం వస్తువులు ఉంచుతున్నారు. నిజానికి బయట మార్కెట్‌కంటే మరింత మన్నికైన వస్తువులను ఉంచాల్సి ఉండగా చౌకబారు వస్తువులను ఉంచుతున్నారని ఆమె 18 ఏళ్ల క్రితమే ఆక్రోషించారు.** అంతేకాదు మాపిల్లలు కూడా కంప్యూటర్ నేర్చుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేయగలరు. అయితే దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెడుతున్నా సరైన సదుపాయాలను ప్రభుత్వం అందించలేకపోతోందని ఆమె





మహా వీర చక్ర అవార్డు అందుకున్న మేజర్ పద్మపాణి ఆచార్య (ఫైల్)

ఆక్రోషించారు.

నిజమే బ్రతకాలంటే ఎలాగైనా బ్రతకొచ్చు. అయితే సమున్నతంగా , దేశం కోసం బ్రతికామన్న సంతృప్తితో జీవించడం వేరు. అలాంటి ఉన్నత భావాలతో విధులు నిర్వహిస్తున్న వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం అత్యంత అమానుషం.

ఉగ్ర మూకల దాడుల్లో సైనికులు నేల కొరిగిన ఘటనలతో దేశభక్తిని చాటే బీజేపీ పాలకులు. సైనికుల కష్టనష్టాలను మాత్రం పట్టించుకోవట్లేదంటే కేవలం ఆరోపణ కాదు. లాన్స్‌నాయక్, సిపాయి, హవల్దార్... సైన్యంలో దిగువశ్రేణి సిబ్బందిని ఉన్నతాధికారులు బానిసలుగా చూస్తున్నారని తమ బూట్లను తుడిపించి పాలీష్ చేయిస్తున్నారని లాక్స్‌నాయక్ యజ్ఞప్రతాప్ సింగ్ ఇటీవల సోషల్ మీడియాలో వాపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతడు నాలుగు రోజులుగా నిరవధిక నిరాహార దీక్షచేస్తున్నాడు. ఈ విషయంపై కలత చెందిన అతడి భార్యా తన భర్త ఉన్నతాధికారులకు ఊడిగం చేయాలా? అని రిచాసింగ్ ఆవేశంగా నిలదీశారు. దేశానికి సేవ చేయాలనే ఉన్నతాశయంతోనే తన భర్త సైన్యంలో చేరాడని ఆమె అన్నారు. అందుకు భిన్నంగా అధికారుల నివాసాల్లో ఊడిగం చేయడానికి కాదన్నారు. సైన్యంలోని దిగువ శ్రేణి సిబ్బందికి అందుతున్న నాసిరకం సదుపాయాలను, దిగువ శ్రేణి సిబ్బంది ఎదుర్కొంటున్న వివక్షను వెలుగులోకి తెచ్చేందుకు తన భర్త గత నాలుగు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష జరిపారు. కార్లు కడగాలనీ, బూట్లు పాలిష్ చేయాలనీ ఉన్నతాధికారులు తన భర్తను వేధింపులకు గురి



మేజర్ పద్మపాణి ఆచార్య కుటుంబ సభ్యులు

చేసినట్లుగా ఆమె చెప్పారు. యూపీలోని ఫతేపూర్‌లో తన భర్తను గృహనిర్బంధంలో ఉంచినట్లుగా చెప్పారు. నాలుగు రోజులుగా తన భర్త నిరాహారదీక్ష జరుపుతున్నట్లు అమె తెలిపారు. ఆయనకు మద్దతుగా తానూ నిపవధిక నిరాహారదీక్ష జరుపుతున్నానని మీడియాకు రిచా తెలిపారు. ఓ వైపు ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ తన భర్తకు సరైన వైద్య సేవలందించేందుకు ఇంత వరకూ ఏ చర్యలూ తీసుకోలేదని ఆమె వాపోయారు. డెహ్రాడూన్‌లో పని చేసే తన భర్తను డిసెంబరు 12న ఫతేపూర్‌కు బదిలీ చేశారని సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైన వీడియా డెహ్రాడూన్‌లో చిత్రీకరించిదని రిచా వివరించారు. సైన్యంలోని దిగువ శ్రేణి సిబ్బందికి నాసిరకం సదుపాయాలు అందుతున్నాయనే ఆవేదనతో కూడిన వీడియో ఒకటి గత కొన్నా రోజులుగా సామాజిక మాధ్యమంలో విస్తృతంగా ప్రసారమైన సంగతి తెలిసిందే. ఈవీడియో ప్రసారానికి 14 రాజ్‌పూత్ రైఫిల్స్‌లో లాన్స్ నాయక్‌గా పని చేసే ప్రతాప్‌సింగ్‌ను బ్యాధుడని భావిస్తున్నారు.

సైనికులకు కిందితరగతిగా వ్యవహరించే పారామిలటరీ దళాల భోజన వ్యవహారం అధికారులకు తెలియంది కాదు. అవినీతి పందికొక్కులు అందిన కాడికి దోచుకుంటుంటే కఠోర శ్రమకు కనీసం భోజనం కూడా అందటం దుర్భరమైపోయింది. అత్యంత ధైర్యంగా తేజ్‌బహదూర్ ప్రజలకు తెలియచెప్పడంతో క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని, అతనికి మతిస్థిమితంలేదని అవాకులు చవాకులు పేలిన సైనిక ఉన్నతాధికారులు విధిలేని పరిస్థితుల్లో ఇకపై చేప, గుడ్డులాంటివి మెనూ లో ఉండేట్లు చేస్తామని చెప్పడం సంతోషదాయకం. ధైర్యంచేసి 12 లక్షల మందికి కడుపార భోజనం పెట్టించకగలుగుతున్నాడు. ఆహారం విషయం బయటికొచ్చిందని అధికారులు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా చూడాలి. కాలే కడుపుతో కాపలా సాగించడం ఎలాంటి పరిస్థితుల్లోనూ క్షేమదాయకం కాదని కేంద్రం గుర్తించాలి. పారామిలటరీ దళాలైన సీఆర్‌ఎఫ్ (సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్సు), బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సు), ఐటీబీపీ, ఎస్ఎస్‌ఏ ( సోషల్ సెక్యూరిటీ ఏజెన్సీ), సీఐఎస్ఎఫ్ ( సెక్యూరింగ్ ఇండస్ట్రియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఆఫ్ ఎయిర్‌పోర్ట్సు, మెట్రోస్), లాంటి అన్ని దళాల్లో అవినీతి పురుగుల పని పట్టాలని యావత్ జాతి గణతంత్ర వేడుకల సాక్షిగా కోరుతున్నారు. సైన్యం అంటే సాహసం వారికి గుర్తింపు, గౌరవం ఇచ్చినప్పుడు దేశయువత నిజాయితీగా దేశరక్షణలో పాలు పంచుకుంటారు.

– బోస్



**మా మనవరాలు కూడా సైన్యంలో చేరుతుంది**

– జగన్నాథ ఆచార్య, విమలాచార్య


చిన్నప్పటినుంచి మా మనవరాలు అపరాజిత రాణిరుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయ్ కథలు అడిగి చెప్పించుకునేది. ఆమె ఇప్పుడు 12వ క్లాసు చదువుతోంది. భారత ప్రభుత్వం ఇప్పుడు మహిళా సైనిక విభాగం కూడా ప్రారంభం చేయడం సంతోషంగా ఉంది. త్వరలో అపరాజిత కూడా సైన్యంలో చేరుతుంది.

## అభివృద్ధి పథంలో జుజ్జూరు



**రాజధాని ప్రతినిధి–జుజ్జూరు :** ప్రభుత్వ పథకాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తూ కృష్ణాజిల్లాలోని జుజ్జూరు గ్రామాన్ని రెండు సంవత్సరాలుగా అభివృద్ధి చేస్తున్నామని గ్రామ సర్పంచ్ బాణావత్ బిక్షాలు తెలిపారు. గ్రామ ప్రజల అభ్యున్నతికి చేపట్టిన కార్యక్రమాలు గ్రామాభివృద్ధికి తోడ్పడ్డాయన్నారు. నీరుచెట్టు కార్యక్రమంలో అంతర్గత రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు, ఎస్.టి.ఎఫ్ నిధులతో కరణంగారి ఇంటి నుంచి రూ.4.20 లక్షలతో సి.సి రోడ్డు నిర్మాణం, మండల గ్రాంటుతో రూ.30 లక్షలతో పమిడి మర్రి బాపారావు ఇంటి నుంచి సి.సి రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. పంచాయతీ ఎం.జి. ఎన్. ఆర్. ఇ. జి.ఎస్ మ్యాచింగ్ గ్రాంటు రు.9 లక్షలతో సి.సి. రోడ్డు నిర్మాణం, మైనారిటీ,బి.సి, ఒ.సి ఏరియాలకు విశాఖ ఫ్యాక్టరీ ఇచ్చిన రు.9 లక్షలతో పైపులైను నిర్మాణం చేసామని బిక్షాలు తెలిపారు. రూ.1.20 లక్షలతో రంగాపురం గ్రామ రెండు బోర్లు పైపులైన్లు నిర్మాణం, గ్రామ తాగునీటి పైపుల కోసం రూ.1లక్ష ఖర్చు చేశామన్నారు. రూ.5.5 లక్షలతో బి.సి. కాలనీలో సోలార్ పంపు సెట్లు నిర్మాణం జరిగిందన్నారు. రూ.60 వేల పంచాయతీ గ్రాంటుతో జడ్.పి.హైస్కూల్ పైపులైన్ నిర్మించామన్నారు. రూ.4 లక్షలతో గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రహరీగోడను ఏర్పాటు చేశామన్నారు. గ్రామ అంతర్గత రోడ్డులకు సిమెంటు తూముల ఏర్పాటు చేయటానికి రూ.4లక్షలు ఖర్చు అయిందన్నారు. గ్రామ ఉత్తర, దక్షిణ ప్రాంతంలో వాటర్ ట్యాంకులు నిర్మించటానికి రు.50 లక్షలు ఖర్చు చేసి మంచి నీటి సదుపాయాన్ని కల్పించామన్నారు. రూ.25 వేలతో వాటర్ ట్యాంకు వద్ద ప్లాట్‌ఫాంను నిర్మించామని ఆమె వివరించారు. రూ.3.5 లక్షల పంచాయతీ గ్రాంటులో డ్రైనేజ్ కల్వర్ట్ నిర్మాణం చేసామన్నారు. హరిజన వాడల అభివృద్ధికి జిల్లా పరిషత్ ఇచ్చిన రూ.5 లక్షలతో సి.సి. రోడ్డు నిర్మించామని, మురికి కాలువలతో పూడిక తీతకు రూ.3 లక్షలు ఖర్చు చేశామన్నారు. రూ.2 లక్షల గ్రాంటుతో హాస్టల్‌కు ప్రహరీగోడ నిర్మాణం చేపట్టామన్నారు. 2 లక్షలతో బి.సి. కాలనీ ఎం.పి.పి స్కూల్‌లో మురుగు రోడ్ల నిర్మాణం చేశామన్నారు. మొత్తం మీద రూ.2 కోట్లు అభివృద్ధి పనులకు వెచ్చించామన్నారు.

జుజ్జూరు గ్రామ పంచాయతీకి మరిన్ని నిధులు అవసరమని బిక్షాలు వెల్లడించారు. ఎం.ఎల్.ఏ గ్రాంటు క్రింద జల్లి ఎసోబు కమ్యూనిటీహాలు కొరకు రూ.4లక్షలు రావాల్సి ఉందని ఉత్తర ప్రాంత హరిజనవాడ లో సి.సి. రోడ్డు నిర్మాణం రూ.5 లక్షలు, ఎస్‌సీ.బి.సి., ఒ.సి, ప్రాంతాల్లో ఎం.యు.ఆర్.ఈ.జి.ఎస్ గ్రాంటుతో '10సిసి ' రోడ్ల నిర్మాణానికి రూ.30లక్షలు, ఎం.పి గ్రాంటుతో దక్షిణ హరిజనవాడ పైపులైన్ల నిర్మాణనికి రూ.5 లక్షలు మంజూరు కావాల్సి ఉందని మొత్తం రూ.44 లక్షలు నిధులు మంజూరు కావాల్సి ఉందని సర్పంచ్ బాణావత్ బిక్షాలు పేర్కొన్నారు.



## నాలుగేళ్లకే.. వెయ్యి పుస్తకాలు



**వాషింగ్టన్ :** అమెరికాలోని ఈ నాలుగేళ్ల చిన్నారి వెయ్యికి పైగా పుస్తకాలు చదివి ప్రపంచంలోనే అతిపెద్ద గ్రంథాలయంలో ఒక్కరోజు లైబ్రీరియన్గఆ పనిచేసే అరుదైన అవకాశాన్ని పొందింది. జార్జియాలోని గైనేస్విల్లికి చెందిన ఆర్నా ఈ అవకాశాన్ని దక్కించుకున్న తొలి ఆఫ్రికా–అమెరికాన్ చిన్నారిగా చరిత్రసృష్టించింది. ఈ నెల 11న యూఎస్‌లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్‌లో ఒక్కరోజు లైబ్రీరియన్‌గా ఆర్నా లైబ్రీరియన్ కార్లా పైడన్‌సహా పలువురు సిబ్బందితో కాసేపుమాట్లాడిన తర్వాత గ్రంథాలయం మొత్తం కలియ తిరిగింది. అనంతరం లైబ్రరీలో గోడలకు కొన్ని వైట్‌బోర్డులు పెట్టాలని కూడా వారికి సలహా ఇచ్చిందట. ఈ బోర్డుల్లో చిన్నారులు రాతను సాధన చేసేందుకు ఉపయోగపడతాయని చెప్పడంతో ఆ తెలివైన ఆలోచనకు లైబ్రరీ సిబ్బంది ముచ్చటపడి అందుకున్నారు. అంగీకరించారు. అయితే దీనికి సంబంధించిన ఫొటోలను అక్కడి లైబ్రరీయన్‌హైడన్ ట్వీట్ చేస్తూ.. నాలుగేళ్ల చిన్నారి 1000 పుస్తకాలు చదవడమనేది అద్భుతం అంటూ ట్వీట్ చేశారు.

## ఆక్స్‌ఫర్డ్‌లో రాజనీతి శాస్త్రం చదువుతా : మలాల



**లండన్/ఇస్లామాబాద్ :** ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కారాన్ని అందుకున్న పాకిస్థానీ అమ్మాయి మలాలా యూసుఫ్‌జాయ్‌కు ప్రధానమంత్రి కావాలన్న కోరిక ఉంది. తన కలలను సాకారం చేసుకునే దిశగా ఆమె అడుగులు వేస్తున్నారు. రాజనీతి, ఫిలాసఫీ, ఎకనామిక్స్‌ను అభ్యసించాలని ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో అడ్మిషన్ కోసం ఇంటర్వ్యూ ఇచ్చారు. తాలిబాన్ల చేతుల్లో తృటిలో తప్పించుకున్న ఈ 19ఏళ్ల యువత తన అడ్మిషన్ ఇంటర్వ్యూ కష్టంగా అనిపించిందన్నారు. మిగితా విద్యార్థుల తాను కూడా ఫలితాల కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నానని మలాలా చెప్పారని జియో న్యూస్ పేర్కొంది. ప్రముఖ బ్రిటిష్ రాజకీయ నాయకులు,పౌర సంఘాల కార్యకర్తలు,మీడియా ప్రతినిధులు మాస్టర్స్ చేసేందుకు ఎక్కువగా రాజనీతి, ఫిలాసఫీ, ఆర్థిక శాస్త్రాలను ఎంచుకుంటారు. మలాలా కుటుంబం ప్రస్తుతం బర్మింగ్‌హాంలో స్థిరపడింది. అక్కడి ఎడ్జబాస్టన్ బాలికల హైస్కూల్‌లో మలాలా చదువుకున్నారు. అనేక ఇంటర్వ్యూలో పాకిస్థాన్ ప్రధాని కావాలన్న తన ఆకాంక్షను ఆమె మాట్లాడుతూ 'మహిళలు ఉపాధ్యాయులు లేదా గృహిణులు అవుతారనుకునేదాన్ని కాని ఇప్పుడు ఆ ఆలోచన మారింది. మహిళా కళాకారులు, వ్యోమగాములు, వ్యాపారవేత్తలు, అథ్లెట్లను చూసి స్ఫూర్తి పొందాను. వారి ఆదర్శకంగా డాక్టర్ కాదు పాకిస్థాన్‌కు ప్రధానమంత్రి కావాలని, అక్కడి సమస్యలను తీర్చాలని నిర్ణయించుకున్నా' అని చెప్పారు. తన అనుభవాలపై మలాలా రాసుకున్న స్వీయచరిత్ర 'ఐ యామ్ మలాలా' 2013 అక్టోబరులో ప్రచురితమైంది. దాదాపు 1.8 మిలియన్ కాపీలు అమ్ముడుపోయాయి.




వెస్ట్ గోదావరి కొయ్యలగూడెంలో రాజధాని వార్తలు 2017 కాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మహిళా కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్ల మేఘలాదేవి






## శ్రీకాకుళం, ప్రకాశంలో 5 డయాలసిస్ కేంద్రాలు

- ఉద్దానంలో ఇంటింటి సర్వేకు వైద్య బృందాలు
- వైద్యసేవలతోపాటు మందుల ఉచిత పంపిణీ
- రోగులకు ఉచిత బస్‌పాస్‌లు, పెన్షన్లు ఇచ్చే యోచన: కామినేని



**రాజధాని ప్రతినిధి– విజయవాడ :** శ్రీకాకుళం జిల్లా ఉద్దానంతోపాటు ప్రకాశంజిల్లా కిడ్నీ బాధిత ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఒకవైపు వైద్య సేవలను అందచేస్తూనే కల్పిస్తు రోగుల్లో మానసిక స్థైర్యాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖమంత్రి కామినేని శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్దానంలో ఇంటింటి సర్వేకు వైద్య బృందాలను పంపిస్తున్నామన్నారు. అలాగే కిడ్నీ వ్యాధి గ్రామస్తులకు వైద్య సేవలతోపాటు మందులను ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే మరో ఐదు డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన వివరించారు. రోగులకు బస్‌పాస్‌లు, పెన్షన్లను ఇచ్చే యోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రజారోగ్యం భద్రత కోసం ప్రభుత్వం వేల కోట్లను వెచ్చిస్తోందన్నారు. కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా 12 డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. శ్రీకాకుళం జిల్లాలో పలాస, సోంపేట, ప్రకాశంజిల్లాలో కందుకూరు, కనిగిరి మార్కాపురం ప్రాంతీయ ఆసుపత్రుల్లోనూ, పది పడకల సౌలభ్యం కలిగిన డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉద్దానంలో ఒక పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్రాన్ని ఒప్పించనున్నట్లు ఆయన చెప్పారు. ఫిబ్రవరి 6వ తేదీన కేంద్రం నుండి ఐసీఎంఆర్ కమిటీ రానున్నట్లు మంత్రి చెప్పారు. ఇదిలా ఉండగా ఉద్దానంలో కిడ్నీ రోగాలు ఎందుకు ప్రబలుతున్నాయనేది ఇప్పటి వరకూ వైద్యులు గుర్తించలేకపోయారు. తాగునీటితోపాటు స్థానికుల ఆహారం అలవాట్లు పరీక్షలు నిర్వహించారు. అయినా కారణాలు తెలియరాలేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రోగాల మూలాలు వెతికిపట్టుకోవాలనే కృత నిశ్చయంతో ముందుకు సాగుతోంది. అవసరమైతే విదేశాల నుంచి నిపుణులను రప్పించాలని యోచి స్తోంది. ఎన్టీఆర్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ రవిరాజ్ ఆధ్వర్యంలో ఒక హైపవర్ కమిటీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఉద్దాన ప్రాంతంలోని తాగునీరు, పంటలపై పురుగుల మందుల వినియోగం, ఆ మారపు అలవాట్లపై ఈ కమిటీ క్షుణ్ణంగా అధ్యయనం చేయనుంది. అలాగే ఆరు సంచార వైద్య బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ఉద్దానం ప్రాంతంలోని 107 గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సీఎం క్రియేటిన్, బ్లడ్ యూరియా పరీక్షలు నిర్వహిస్తాయి. ఈ విధంగా నాలుగైదు ఉద్దాన ప్రాంత ప్రజల ఆరోగ్య నివేదికను రూపొందిచనున్నారు.









Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan, Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18